



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 262 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 13 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-


### వాళ్ళకి ఎలాంటి విజన్ లేదు..

# పాయిజన్ మైండ్!

- తిరుపతిలో 'రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం' సభలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- గత ఐదేళ్ల పాలన రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని, ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని గాడిలో పెడుతోందని వ్యాఖ్య
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడుల గురించి వివరించిన ముఖ్యమంత్రి
- ప్రధాని మోదీ నాయకత్వాన్ని, కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కొనియాడిన చంద్రబాబు
- స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా, మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టీకరణ

**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతి వేదికగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి (ఎన్డీఏ) ప్రభుత్వం 'రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం' పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించింది. ఈ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు కింజరపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎన్డీఏ కూటమి నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ ప్రసంగం చేసి, రెండేళ్ల పాలనలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని, భవిష్యత్ ప్రణాళికలను ప్రజల ముందుంచారు. తన



రాజకీయ ప్రస్థానం మొదలైన తిరుపతిలో, ఏడుకొండలస్వామి చెంతన ఈ కార్యక్రమం జరగడం సంతోషంగా ఉందని, ఇది తనకు పునర్జన్మ లాంటిదని ఆయన వ్యాఖ్యానించారు.


**ప్రజా పాలనకు పునరంకితం**

2024 ఎన్నికల్లో 57 శాతం ఓట్ షేర్‌తో ప్రజలు ఎన్డీఏ కూటమికి చారిత్రక విజయాన్ని అందించారని చంద్రబాబు గుర్తుచేశారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికే ఈ సభను నిర్వహిస్తున్నామని, ప్రజాసేవకు తమ ప్రభుత్వం పునరంకితమవుతోందని ప్రకటించారు. ఈ రెండేళ్లలో ఏం చేశామో, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏం చేయలేక పోయామో కూడా ప్రజలకు చెప్పడానికి మిగతా .. 2లో..

### చారిత్రక విజయానికి కారణమైన

## ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలు కేవలం ఓటే కాదు.. చరిత్ర రాస్తారని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 2024లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్రానికి మళ్లీ కొత్త ఆశలు వచ్చాయని, ఆ తీర్పు ఒక తరం భవిష్యత్తుకు నమ్మకం కలిగించిందన్నారు. ప్రజలు మౌనంగా కనిపించినా.. చరిత్రను మార్చగలరని నిరూపించారన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమి నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ "రెండేళ్ల క్రితం కేవలం అధికారం కాదు.. బాధ్యత ఇచ్చారు. చారిత్రక విజయానికి కారణమైన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు. అహంకారం, విధ్వంసంపై.. ప్రజాస్వామ్యం సాధించిన విజయం ఇది. ఏపీ పునర్నిర్మాణం కోసం ఏర్పడిన కూటమి ఇది. అధికారం పంచుకోవడానికి కాదు.. బాధ్యత పంచుకునేందుకు కూటమి ఏర్పడింది. కూటమిలో జనసేన 21 సీట్లతో సరిపెట్టుకున్న సందర్భంలో చాలామంది విమర్శించారు. కానీ, ప్రజల ఆశీర్వాదంతో వందశాతం స్ట్రైక్ రేట్ సాధించాం. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి అత్యంత నిబద్ధతతో పని చేస్తున్నాం. ఎన్నికైన ప్రధానిగా నిరంతరాయంగా సుదీర్ఘకాలం కొనసాగిన మోదీకి అభినందనలు. ఎన్డీయే సమష్టి కృషితో విశాఖ స్టీల్ ప్లాంట్ మిగతా .. 2లో..

### పరారైన జీవిత ఖైదీని 24 గంటల్లో

## అదుపులోకి తీసుకున్న కడప పోలీసులు

**కడప, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నం ప్రభుత్వ మానసిక ఆసుపత్రి నుంచి తిరిగొస్తూ పరారైన జీవిత ఖైదీని కడప పోలీసులు 24 గంటల్లో అదుపులోకి తీసుకున్నారు. నంద్యాల జిల్లాకు చెందిన సాకే రాజ్‌కుమార్‌కు పోక్సో కేసులో కోర్టు జీవిత ఖైదు విధించడంతో గతేడాది సెప్టెంబరు నుంచి కడప కేంద్ర కారాగారంలో ఉన్నాడు. ఈ క్రమంలో అతడి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఇటీవల విశాఖపట్నంలోని ప్రభుత్వ మానసిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యం మిగతా .. 2లో..

# మన గొప్ప ఎగుమతి మన ప్రజలే

★ వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యమన్న మంత్రి లోకేష్ ★ నైపుణ్యం కలిగిన మానవ వనరులతోనే పోటీ సామర్థ్యం పెరుగుతుందని స్పష్టీకరణ ★ స్పీడ్, బ్రాండ్ సీబీఎన్, బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఏపీ ప్రత్యేకతలని వెల్లడి ★ యువతకు ఉపాధి అవకాశాల కోసం రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లు ★ దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయని వెల్లడి



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** వికసిత్ భారత్ నిర్మాణం అనే బృహత్ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తుందని, నైపుణ్యం కలిగిన మానవ వనరులను సృష్టించడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సుసంపన్న భవిష్యత్తు కోసం మానవ వనరులపై పెట్టుబడి పెట్టడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన అన్నారు. విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో జరిగిన 'డీజీ 100ఎక్స్ ఏపీ' సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్య, ఆవిష్కరణల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న మేధావుల మధ్య ఉండటం ఆనందంగా ఉందని, అందరి లక్ష్యం ఒక్కటేనని.. అదే బలమైన భారతదేశ నిర్మాణమని పేర్కొన్నారు.

**నైపుణ్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం**

ప్రపంచం అత్యంత వేగంగా మారుతోందని, కృత్రిమ మేధ (ఏఐ) వంటి సాంకేతికతలు పరిశ్రమలను, ఉద్యోగాలను పునర్నిర్వచిస్తున్నాయని లోకేశ్ అన్నారు. ఈ పోటీ ప్రపంచంలో ఏ దేశానికైనా, రాష్ట్రానికైనా అసలైన బలం భూమి, సహజ వనరులు కావని, ప్రతిభ కలిగిన మానవ వనరులేనని నొక్కి చెప్పారు. దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ దేశానికి అత్యుత్తమ ప్రతిభను అందించిందని, చంద్రబాబు గత పదవీకాలాల్లో చేపట్టిన సంస్కరణల ఫలితంగానే నేడు సిలికాన్ వ్యాలీ నుంచి సింగపూర్ వరకు తెలుగువారు మిగతా .. 2లో..

### ఆ కారణంతోనే

## పవన్ సభకు అనుమతివ్వలేదు

**తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి**



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) భాజపా కార్యకర్తలా వ్యవహరించారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. దిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో రేవంత్ మాట్లాడారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై ఆయన విమర్శలు చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సభకు హైదరాబాద్‌లో అనుమతి నిరాకరించిన అంశంపైనా సీఎం స్పందించారు.

**కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా**

"మధ్యప్రదేశ్‌లో భాజపాకు సరిపడా సంఖ్యా బలం లేకపోయినా.. రాజ్యసభ స్థానానికి మూడో అభ్యర్థిని పోటీకి పెట్టారు. ఇప్పటి వరకు భాజపా ఓటు చోరీ మాత్రమే చేసింది.. ఇప్పుడు సీట్ చోరీ కూడా మిగతా .. 2లో..

### హెచ్-1బీ వీసా ఫీజుపై

## వెనక్కి తగ్గని ట్రంప్




**విశ్వం వాయిస్ న్యూస్ :** హెచ్-1బీ వీసా ఫీజు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అస్సలు వెనక్కి తగ్గడం లేదు. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇటీవల కొట్టివేసింది. ఈ తీర్పును మిగతా .. 2లో..

### పోలీస్ స్టేషన్ ఎదుట స్నానం చేసి

## వినూత్న నిరసన తెలిపిన జేసీ

**మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు**



**తాడిపత్రి, విశ్వం వాయిస్ న్యూస్ :** తాడిపత్రిలో టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసుల తీరుకు నిరసనగా ఆయన ఏకంగా టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుటే స్నానం చేశారు. అక్కడే వంటావార్పునకు కూడా సిద్ధమై తన నిరసనను వినూత్న రీతిలో కొనసాగించారు. గత వైసీపీ మిగతా .. 2లో..

### భారత నౌకలపై

## దాడులు ఇరాన్ పనే : ట్రంప్

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఒమన్ తీరంలో భారతీయులున్న నౌకలపై ఇటీవల దాడులు జరగడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖండించారు. ఇరాన్ ఆ దాడులకు పాల్పడిందని ఆరోపించిన ఆయన.. అమెరికా బలగాలే వాటిని అడ్డుకున్నాయని చెప్పారు. భారత నౌకలపై దాడులు ఏమాత్రం సమర్థనీయం కాదంటూ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. మరోవైపు, అమెరికాతో ఒప్పందం కుదిరిందని మిగతా .. 2లో..

## రూ.11.82కోట్ల గంజాయి స్మగ్లింగ్

**ఎయిర్‌పోర్టులో చిక్కిన మోడల్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** గంజాయి స్మగ్లింగ్ చేస్తూ ఓ మోడల్ అడ్డంగా దొరికిపోయింది. తన అనుమానాస్పద ప్రవర్తనతో అధికారులకు చిక్కి.. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా జైలు పాలైంది. ముంబయి విమానాశ్రయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కేరళకు చెందిన 28ఏళ్ల హర్ష సన్నీ బ్యాంకాక్ నుంచి ముంబయిలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ మిగతా .. 2లో..

### అమెరికాతో ఒప్పందానికి

## చాలా దగ్గరగా ఉన్నాం : ఇరాన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాతో ఒప్పందం విషయంలో ఇంతకుముందు లేనంత దగ్గరకు వచ్చామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అన్నారు. అయితే ఈ ఒప్పందాన్ని ఖరారు చేసే వరకు, ఇందులోని అంశాలపై ఊహాగానాలను వ్యాప్తి చేయవద్దని మీడియాకు సూచించారు. చర్చలు పూర్తయిన తర్వాత ఒప్పందానికి సంబంధించిన వివరాలు బహిర్గతం చేస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా మిగతా .. 2లో..

### ఎవరితోనూ పొత్తులుండవ్..

## పోటీ భాజపాతోనే : కేటీఆర్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సీఎం రేవంత్‌రెడ్డితో తనకు వ్యక్తిగత పంచాయితీ లేదని.. ప్రభుత్వాన్ని నడుపుతున్న విధానం తనతో సహా చాలా మందికి నచ్చడంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలో ఉందని.. హైదరాబాద్‌లో వర్షం పడి ప్రజలకు ఇబ్బంది ఎదురైతే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. గతంలో 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. నగరాన్ని అద్దంలా మాకు అప్పగిస్తే.. మేం చెడగొట్టామా? అని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడారు.

**నీరు నిలిస్తే బాధ్యత మాదా? :** "బీఆర్ఎస్ హయాంలో మిగతా .. 2లో..

### అమెరికా దళాల దాడిలో

## విశాఖ మెరైన్ ఇంజినీర్ మృతి

**విశాఖ మెరైన్ ఇంజినీర్ మృతిపై పవన్ కల్యాణ్ ఏమన్నారంటే...!**
**ఒమన్ తీరంలో జరిగిన విషాద ఘటన**
**మృతుడు పట్నాల సురేష్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థన**
**బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ**

**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నడుమ జరిగిన ఓ ఘోర ఘటనలో విశాఖపట్నానికి చెందిన మెరైన్ ఇంజినీర్ పట్నాల సురేష్ ప్రాణాలు కోల్పోయారు. ఒమన్ తీరానికి సమీపంలో భారత నౌకపై అమెరికా దళాలు జరిపిన దాడిలో ఆయన మరణించడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ దురదృష్టకర ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "భారత నౌకపై అమెరికా దళాలు జరిపిన దాడిలో విశాఖపట్నానికి చెందిన మిగతా .. 2లో..

### ఎయిరిండియా విమాన దుర్ఘటనపై

## దర్యాప్తు కొనసాగుతోంది

**కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు**



**విశ్వం వాయిస్ న్యూస్ :** అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటన జరిగి నేటికి ఏడాది అయింది. ఈ నేపథ్యంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పందించారు. విమాన ప్రమాదంపై జాతీయ, అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కృషి చేస్తోందన్నారు. ప్రమాదంపై త్వరలో మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# పాయిజన్ మైండ్!

సిద్ధంగా ఉన్నానని, తమ పాలనలో దాపరికం ఉండదని స్పష్టం చేశారు. కష్టకాలంలో విజ్ఞతతో డబుల్ ఇంజన్ సర్కార్‌కు ఓటేసి రాష్ట్రాన్ని గెలిపించిన ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం ఆక్సిజన్ ఇచ్చి బతికించిందని, ఈ రోజు ప్రజలు శాంతియుతంగా, తమ ఆస్తులకు రక్షణతో జీవించగలుగుతు న్నారంటే అది ఎన్డీఏ పాలన వల్లే సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

**గత ఐదేళ్ల చీకటి పాలనపై నిప్పులు**

గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనను 'చీకటి పాలన'గా అభివర్ణించిన చంద్రబాబు, ఆ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా విధ్వంసం చేశారని ఆరోపించారు. కేంద్ర పథకాలను పక్కనపెట్టి, సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. పెట్టుబడిదారులను వేధించి రాష్ట్రం నుంచి తరిమేశారని, యువత భవిష్యత్తును దెబ్బతీశారని అన్నారు. కేంద్రం ఇంటింటికి కుళాయి కోసం రూ.27,000 కోట్లు ఇస్తే, దానిని కూడా వాడుకోలేని దుస్థితిలో గత ప్రభుత్వం ఉందని విమర్శించారు. తనతో పాటు పవన్ కల్యాణ్‌ను కూడా అడుగడుగునా వేధించారని, ఎలాంటి నోటీసు లేకుండా తనను 53 రోజులు జైల్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తులు, చివరికి మద్యాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన వాళ్లకు రాష్ట్రాన్ని గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు.

**సంక్షేమంలో మేం చెప్పింది చేశాం**

ఎన్ని ఆర్థిక కష్టాలున్నా, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. 'సూపర్ సిక్స్' హామీల అమలును ప్రస్తావించారు. ఎన్టీఆర్ భరోసా కింద పెన్షన్లను రూ.4,000కు పెంచి, 63 లక్షల మందికి అందిస్తున్నామని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమమని అన్నారు. 'తల్లికి వందనం' ద్వారా ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఏటా రూ.15,000 ఇస్తున్నామని, 'స్త్రీశక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించగా, ఇప్పటివరకు 71 కోట్ల మంది ప్రయాణించారని వెల్లడించారు. 'దీపం' కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు ఏటా రూ.20,000 అందిస్తున్నామని వివరించారు. వీటితో పాటు గీత కార్మికులు, వడ్డెర్లు, నాయి బ్రాహ్మణులు, పాస్టర్లు, ఇమామ్‌లు తదితర అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

**అభివృద్ధి, పెట్టుబడులతో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తాం**

గత ప్రభుత్వ హయాంలో పారిపోయిన పెట్టుబడిదారులకు మళ్లీ నమ్మకం కల్పించామని చంద్రబాబు అన్నారు. భూమి, నీళ్లు, అనుమతులు సకాలంలో ఇచ్చి, సుస్థిరమైన ప్రభుత్వాన్ని అందించడంతో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరిపాలనలో చెత్త, పరిసరాల్లో చెత్త, మనసుల్లో చెత్తను తీసివేసి 'స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్'ను నిర్మిస్తున్నామని అన్నారు. చెత్త పన్ను, నాలా చట్టం వంటి ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేశామన్నారు. దేశంలోనే తొలిసారిగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా, ట్రూ-డౌన్ ఛార్జీల ద్వారా తగ్గించి ప్రజలపై రూ.466 కోట్ల భారాన్ని తగ్గించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదేనని గర్వంగా చెప్పారు.

**మోదీ నాయకత్వం దేశానికి శ్రీరామరక్ష**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఓటమి ఎరుగని నాయకుడిగా అభివర్ణించిన చంద్రబాబు, ఆయన నాయకత్వ పటిమను కొనియాడారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. మోదీ పాలనలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని, జాతీయ రహదారులు, విమానాశ్రయాలు, వందే భారత్ రైళ్ల వంటి మౌలిక సదుపాయాలు గణనీయంగా పెరిగాయని తెలిపారు. చంద్రయాన్, గగన్‌యాన్ వంటి ప్రయోగాలతో ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠ ఇనుమడించిందని ప్రశంసించారు. నిన్న జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో కూడా 'వికసిత్ భారత్' కోసం ప్రధాని స్పష్టమైన బ్లూప్రింట్ ఇచ్చారని, దేశంతో పాటు రాష్ట్రాన్ని కూడా ముందుకు నడిపిస్తామని అన్నారు.

**విజన్ 2047 లక్ష్యంగా ప్రయాణం**

దేశం కోసం ప్రధాని మోదీ 'వికసిత్ భారత్ 2047' లక్ష్యంతో పనిచేస్తుంటే, రాష్ట్రంలో తాము 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చంద్రబాబు తెలిపారు. గొడ్డలి పార్టీ (వైసీపీ)కి ఎలాంటి విజన్ లేదని, వారిది పాయిజన్ మైండ్ అని విమర్శించారు. ఫేక్ న్యూస్‌తో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, కానీ తాము ప్రజలను, అభివృద్ధిని నమ్ముకున్నామని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్యకర్తలు అందరూ ప్రజలకు సేవకులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తప్పు చేసిన వారు ఎవరైనా, సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, దీర్ఘకాలిక ప్రయోజనాలతో, ప్రజలు మెచ్చే పాలన అందిస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారు.

## ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు

ప్రైవేటీకరణ కాకుండా ఆపగలిగాం. దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగి 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దుర్ఘటన జరిగినందున ఈనెల 9న జరగాల్సిన కార్యక్రమం ఇవాళ జరుపుకొంటున్నాం. ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలే" అని డిప్యూటీ సీఎం అన్నారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## అదుపులోకి తీసుకున్న కడప పోలీసులు

అనంతరం రైలులో కడప జైలుకు తీసుకొస్తుండగా శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు రైల్వేస్టేషన్ వద్ద భద్రతా సిబ్బంది కళ్లుగప్పి పరారయ్యాడు. తప్పించుకున్న ఖైదీ కోసం వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రొద్దుటూరు శివారులో సంచరిస్తున్నట్లు గుర్తించి శుక్రవారం అదుపులోకి తీసుకుని కడప కేంద్ర కారాగారానికి తీసుకెళ్లారు.

## హెచ్-1బీ వీసా ఫీజుపై వెనక్కి తగ్గని ట్రంప్

సవాల్ చేసేందుకు అమెరికా న్యాయశాఖ చర్యలు చేపట్టింది. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకున్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే, దీన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమొక్రటిక్ నేతలు ఉన్న రాష్ట్రాలు కోర్టుల్లో సవాల్ చేశాయి. ఈ క్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. దీంతో పలు కంపెనీలకు ఊరట కలిగింది. ఈ నేపథ్యంలో ఫెడరల్ కోర్టు తీర్పును అప్పీల్ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ అమెరికా న్యాయశాఖ నోటీసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం తాజా చర్యతో ఈ అంశం మరికొన్ని నెలల పాటు న్యాయస్థానాల్లో మగ్గనుంది. దీంతో ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్లే.

## చాలా దగ్గరగా ఉన్నాం : ఇరాన్

ఆయన పోస్టు చేశారు. మరోవైపు ఈ పోస్టు స్క్రీన్‌షాట్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో షేర్ చేశారు. ఇరాన్‌తో చర్చలు దాదాపు కొలిక్కి వచ్చాయని, ఆ దేశ అగ్రనాయకత్వం తమ ప్రతిపాదనలకు అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిన్న పేర్కొన్న విషయం తెలిసిందే. దీంతో ఇరాన్‌పై దాడులను విరమించుకున్నట్లు ప్రకటించారు. ఒప్పంద అంశాలకు ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, టర్కీయే, పాకిస్థాన్, ఇజ్రాయెల్, ఈజిప్ట్ కూడా సమ్మతి తెలిపాయని సామాజిక మాధ్యమ పోస్టు ద్వారా వెల్లడించారు. తాజా అబ్బాస్ అరాఘ్చీ ఈ విషయంపై స్పష్టత ఇవ్వడంతో ఒప్పందం త్వరలోనే కుదురుతుందని భావిస్తున్నారు.

## మన గొప్ప ఎగుమతి మన ప్రజలే

ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు. మన గొప్ప ఎగుమతి మన ప్రజలేనని, వారిపై పెట్టుబడి పెట్టడం మనందరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. విద్య అంటే కేవలం డిగ్రీ సర్టిఫికెట్ ఇవ్వడం కాదని, జీవితాంతం నేర్చుకునే ప్రక్రియలో ప్రభుత్వం భాగస్వామి కావాలని అన్నారు. అందుకోసం రెండు వారాల్లో 'నైపుణ్యం పోర్టల్' ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిన్నటి ఉద్యోగాల కోసం కాకుండా, ఏఐ, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్ వంటి భవిష్యత్ రంగాల కోసం విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని వివరించారు.

**వ్యక్తిగత ఇష్టంతోనే విద్యాశాఖ బాధ్యతలు**

ముఖ్యమంత్రి శాఖల కేటాయింపు సమయంలో తాను అడిగి మరీ విద్యాశాఖను తీసుకున్నానని లోకేశ్ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. చాలామంది వద్దని వారించినా, తదుపరి తరం నాయకులను ప్రేరేపించే అవకాశం విద్య ద్వారానే లభిస్తుందనే బలమైన నమ్మకంతో ఈ బాధ్యతను స్వీకరించానని తెలిపారు. పిల్లలను నేను హృదయపూర్వకంగా ప్రేమిస్తాను... వారు చూపే ప్రేమ, ఆప్యాయత, నిజాయతీ నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తాయి... అందుకే విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీజీ సంస్థ సీఈవో హేమంత్ సహల్, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, అపోలో హాస్పిటల్స్ జాయింట్ ఎండీ డా.సంగీత రెడ్డి, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పవన్ సభకు అనుమతివ్వలేదు

మొదలుపెట్టింది. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలి. ప్రధాని మోదీనే నన్ను కౌగిలించుకున్నారు.. నేను కాదు. హిట్లర్ నాకు ఆదర్శమని నేనెప్పుడూ చెప్పలేదు. ప్రజాస్వామ్యంలో ఉన్నవాళ్లు ఎవరైనా హిట్లర్ ఆదర్శమని అంటారా? మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం వద్ద చర్చ జరగలేదు" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## వినూత్న నిరసన తెలిపిన జేసీ

ప్రభుత్వ హయాంలో మాదిరిగానే ఇప్పుడూ పోలీసులు తమపై కక్ష సాధిస్తున్నారని, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి కొమ్ముకాస్తున్నారని జేసీ ఆరోపించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం పెద్దారెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన దీక్షకు దిగారు. తనకు 74 ఏళ్ల వయసని, పదవులపై ఆశ లేదని, కానీ పోలీసుల తీరుకు భయపడేది లేదని స్పష్టం చేశారు. జేసీ ప్రభాకర్ రెడ్డి నిరసనతో పోలీసులు వెనక్కి తగ్గారు. రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై కేతిరెడ్డి పెద్దారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 196(1) కింద కేసు నమోదు చేశారు. దీంతో ప్రభాకర్ రెడ్డి తన దీక్షను విరమించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జేసీ, తాడిపత్రిలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా ఎస్పీతో తేల్చుకుంటానని అన్నారు. ఇందుకోసం వచ్చే సోమవారం తన అనుచరులతో కలిసి ఎస్పీ కార్యాలయానికి వెళ్లనున్నట్లు ప్రకటించారు. ఈ పోరాటానికి టీడీపీకి ఎలాంటి సంబంధం లేదని, ఇది పూర్తిగా తన వ్యక్తిగత విషయమని ఆయన స్పష్టం చేశారు. "మేము తాడిపత్రిలో ఉండాలా? వద్దా? అనే విషయాన్ని నేరుగా ఎస్పీనే అడిగి తెలుసుకుంటాం" అని జేసీ వ్యాఖ్యానించారు.

## దాడులు ఇరాన్ పనే : ట్రంప్

ఇరాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ నేతలకు నిజాయతీ లేదని, వాళ్లతో మంచి ఒప్పందం కష్టమేనన్నారు. ఆ దేశం వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు. ఇదిలాఉంటే, ఒమన్ తీరంలో భారతీయులున్న నౌకలపై గత నాలుగు రోజుల్లో మూడు సార్లు దాడులు జరగ్గా.. ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

## రూ.11.82కోట్ల గంజాయి స్మగ్లింగ్

విమానాశ్రయంలో దిగింది. అయితే, ఆమె ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్, కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు అడ్డుకున్నారు. ఆమె ట్రాలీబ్యాగ్‌ను తనిఖీ చేయగా.. 12 ప్లాస్టిక్ ప్యాకెట్స్ బయటపడ్డాయి. అందులోని పదార్థమంతా ఆకుపచ్చరంగులో ఉండటంతో ఎయిర్‌పోర్ట్‌లోనే నార్కో పరీక్షలు నిర్వహించారు. ఆ పదార్థాన్ని గంజాయిగా గుర్తించారు. ప్యాకెట్ల బరువు 11 కేజీలు ఉండగా.. ఆ డ్రగ్ విలువ దాదాపు రూ.11.82 కోట్ల వరకు ఉంటుందని కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. నిషేధిత మాదకద్రవ్యాల స్మగ్లింగ్ కింద ఆమెను ఎయిర్‌పోర్టులోనే అరెస్టు చేసి.. కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆ మోడల్‌ను జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించింది. ఇక, ఆ సరకును దేశంలోని ఏ ప్రాంతానికి తరలించడానికి ఆమె తీసుకువచ్చిందనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ హర్ష సన్నీ 2025లో జరిగిన మిసెస్ కేరళ పోటీదారు కావడం గమనార్హం.

## పోటీ భాజపాతోనే : కేటీఆర్

వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ) చేపట్టి మెరుగు చేస్తే.. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేశారు. నీళ్లు నిలవకపోతే క్రెడిట్ తీసుకుంటారు.. నిలిస్తే బీఆర్ఎస్‌ది బాధ్యత అంటారా? ఉన్న నగరంపై సీఎంకు అవగాహన లేదు కానీ.. ఫ్యూచర్ సిటీ అని ప్రగల్భాలు పలుకుతున్నారు. రేవంత్ సీఎం కాగానే ఎయిర్‌పోర్టుకు మెట్రోను రద్దు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండి ఉంటే ఈ పాటికే పూర్తయ్యేది. ఆ మెట్రో లైన్ పూర్తయి ఉంటే సమస్య ఇంత ఉండేది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయింది. ఎల్ అండ్ టీ నుంచి మెట్రోను లాక్కోవడం తప్ప చేసిందేంటి? హైడ్రానే అన్నీ చేస్తోందని చెప్పి అధికారాలు ఇచ్చి బ్లాక్‌మెయిలింగ్ వ్యవస్థలా చేశారు.

## విశాఖ మెరైన్ ఇంజినీర్ మృతి

మెరైన్ ఇంజినీర్ పట్నాల సురేష్ ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. ఒమన్ తీరానికి సమీపంలో జరిగిన ఈ దురదృష్టకర ఘటనలో ఆయన మరణించారన్న వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి, ఆవేదనకు గురిచేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం చాలా బాధాకరం. సురేష్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఈ కష్టకాలంలో ప్రభుత్వం ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తుంది. వారిని ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని హామీ ఇస్తున్నాను" అని పవన్ తన ప్రకటనలో తెలిపారు.

**నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి**

హర్మూజ్ జలసంధి సమీపంలో ఆయిల్ ట్యాంకర్ నౌకపై జరిగిన దాడిలో విశాఖపట్నానికి చెందిన మెరైన్ చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్ (44) మృతి చెందడంపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ వార్త తనను తీవ్ర ఆవేదనకు, షాక్‌కు గురిచేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నాడు 'ఎక్స్' వేదికగా స్పందించారు.

## దర్యాప్తు కొనసాగుతోంది

తుది నివేదిక వస్తుందని.. దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విమానయాన భద్రతను మరింత మెరుగుపరిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ దుర్ఘటనకు సంబంధించి తప్పుడు ప్రచారాలు చేయొద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.


**దర్యాప్తులో గణనీయమైన పురోగతి సాధించాం: ఏఏఐబీ**

అంతర్జాతీయ సమీక్షలు, సంప్రదింపు ప్రక్రియలు పూర్తయిన తర్వాత విమాన ప్రమాదంపై తుది నివేదిక విడుదల చేస్తామని ఈ దుర్ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏబీఐ) వెల్లడించింది. ప్రమాదానికి అసలు కారణం తెలుసుకొనేందుకు ఫ్లైట్ రికార్డర్ డేటా, ఇంజిన్ భాగాలు, ఇతర ఆధారాలను విశ్లేషిస్తున్నామని తెలిపింది. ఇప్పటివరకు దర్యాప్తులో గణనీయమైన పురోగతి సాధించామని.. అందులో కనుగొన్న విషయాలను నిర్ధరించుకొనేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొంది. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ విషాదానికి గురిచేసిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో విశ్వాస్ కుమార్ అనే వ్యక్తి మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. విమానం హాస్టల్ భవనంపై కూలడంతో మృతుల సంఖ్య 260కి చేరింది. బాధిత కుటుంబాలకు టాటాగ్రూప్ నష్ట పరిహారం చెల్లించింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

# పరాయి నేల శ్రమ... స్వదేశీ ఆర్థిక శ్వాస!

ప్రపంచ బ్యాంక్ తాజాగా విడుదల చేసిన ఒక నివేదిక దేశవ్యాప్తంగా పెద్ద సంచలనమే సృష్టించింది. ఆ గణాంకాలు ప్రతి భారతీయుడిని మరోసారి గర్వంతో ఉప్పొంగేలా చేశాయి. గడిచిన 2024–25 ఆర్థిక సంవత్సరంలో విదేశాల నుండి భారత్‌కు వచ్చిన రిమిటెన్సులు (ప్రవాసులు పంపే నిధులు) సుమారు 135 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇది మన దేశ చరిత్రలోనే అత్యధికం, అప్రతిహతం! దేశ మొత్తం జనాభాలో పది శాతం కూడా లేని మన ప్రవాస భారతీయులు, నేడు దేశ స్థూల జాతీయోత్పత్తి (+ఇూ) లో దాదాపు మూడు శాతానికి పైగా వాటాను సమకూరుస్తున్నారంటే చిన్న విషయం కాదు. కార్పొరేట్ దిగ్గజాల గుండెల్లో రైళ్ళు పరిగెత్తించే ఈ అంకెలు పైకి ఎంత ప్రశంసనీయంగా, ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయో వాటి వెనక దాగిన అంతర్మథనం అంతకంటే తీవ్రమైనది. మన దేశ ప్రగతి చక్రం ఎంతకాలం ఇలా పరాయి నేలపై నెత్తురు చెమటగా మార్చి, శ్రమ దోపిడీకి గురవుతున్న మనవారి త్యాగాల ధనం మీదే ఆధారపడి నడుస్తుంది? ఈ మెరిసే అంకెల వెనుక ఉన్న అసలు రంగులను ఓసారి నిశితంగా పరిశీలిద్దాం.

విజయవాడ శివార్లలోని ఒక మధ్యతరగతి ఇల్లాలు ముఖాన్ని చూస్తే, ఈ వలసల అసలు రూపం అర్థమవుతుంది. ఆ ఇంట్లో తండ్రి గల్ఫ్ దేశాల్లో ఎండకు ఎండి, వానకు తడిసి భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుంటాడు. అమ్మ ఇక్కడ పల్లెటూరిలో పొలం పనులు చూసుకుంటుంది. ఇక పెద్ద కొడుకు అమెరికాలోని ఒక సాఫ్ట్‌వేర్ కారిడార్‌లో రేయింబవళ్లు కంప్యూటర్ కీబోర్డులతో కుస్తీ పడుతుంటాడు. ప్రతి నెలా ఆ ఇల్లాలు బ్యాంకు ఖాతాలో పడే డాలర్లు, దిర్హమ్‌లు ఇవే ఆ ఇంటి నాలుగు గోడలకు పునాది, వారి ఉనికికి జీవనవేదం. ఇది కేవలం ఒక్క కుటుంబానికి పరిమితమైన కథ కాదు, ఇరు తెలుగు రాష్ట్రాల్లోని లక్షలాది ఇళ్లకు ఉన్న నగ్న సత్యం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు జాతీయ స్థాయిలో అత్యధికంగా ప్రవాసులను విదేశాలకు పంపే అగ్రగామి జాబితాలో ఉన్నాయి. గల్ఫ్ మురికివాడల నుండి అమెరికాలోని విలాసవంతమైన స్కై స్క్రాపర్ల వరకు, కెనడా మంచు తుఫానుల నుండి ఆస్ట్రేలియా తీరాల వరకు తెలుగు మాట్లాడే గళాలు నేడు ప్రపంచమంతటా మార్మోగుతున్నాయి. ఇదంతా ఒక గ్లోబల్ సక్సెస్ స్టోరీలా కనిపిస్తున్నా, దీని వెనుక స్వదేశంలో ఉపాధి దొరకని నిస్సహాయత ఎంత ఉందో కాదనలేం. ఈ విదేశీ ధనప్రవాహం కేవలం ఆయా కుటుంబాల పొట్టపోషణకే పరిమితం కావడం లేదు. స్థానిక మార్కెట్లను శాసించే శక్తులుగా ఇవి అవతరించాయి. నేడు మన రియల్ ఎస్టేట్ రంగాలు, చిన్న తరహా వ్యాపారాలు, గ్రామీణ వినియోగ సామర్థ్యం అన్నీ ఈ రిమిటెన్సుల శ్వాస మీదే ఊపిరి పోసుకుంటున్నాయి. భాగ్యనగరం ముఖద్వారం నుండి తిరుపతి పుణ్యక్షేత్రం వరకు రియల్ ఎస్టేట్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయంటే, దానికి ప్రధాన ఇంధనం మన ఎన్నారైల పెట్టుబడులే. పల్లెటూళ్లలోకి వెళ్తే పాత పెంకుటిళ్ల స్థానంలో నూతనంగా వెలిసిన బహుళ అంతస్తుల భవనాలు, విలాసవంతమైన కార్లు కనిపిస్తాయి. వాటి వెనుక విదేశీ కరెన్సీ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. భారతదేశ విదేశీ మారక నిల్వలలో రిమిటెన్సుల పాత్ర అత్యంత అమోఘమైనది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కంటే అత్యంత స్థిరంగా, విశ్వసనీయంగా వచ్చే ఈ నిధుల ప్రవాహం రూపాయి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో పాతాళానికి పడిపోకుండా కాపాడుతోంది. గత అనుభవాలను పరిశీలిస్తే, ఆర్థిక సంక్షోభాల సమయంలో ఎఫ్‌డీఐలు వెనక్కి తగ్గుతాయి కానీ, మనవాళ్లు పంపే ప్రేమ ధనం మాత్రం ఆగదు. 2008 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం మరియు 2020 కాలం నాటి మహమ్మారి సమయంలో కూడా విదేశీ పెట్టుబడులు దేశాన్ని వదిలి పారిపోయాయి. కానీ, మన ప్రవాసులు మాత్రం తమ రక్తాన్ని ధారబోసి మరీ స్వదేశానికి డబ్బులు పంపారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక తిరుగులేని రక్షాకవచం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, ఈ డాలర్ల వెల్లువ వెనుక సామాజిక, మానసిక నష్టాలు చాలా లోతుగా పేరుకుపోతున్నాయి. ఈ వ్యవస్థపై మనం పూర్తిగా ఆధారపడటం వల్ల లాభాల కంటే భవిష్యత్తుకు పొంచి ఉన్న ముప్పులే ఎక్కువ. మన ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు ప్రజాధనంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి తయారు చేసిన మేధావులు సర్జన్లు, ఐటీ నిపుణులు, శాస్త్రవేత్తలు ఇక్కడి వ్యవస్థలను కాదని విదేశాలకు వలస వెళ్తున్నారు. వారు తిరిగి రావడం లేదు. దీనివల్ల దేశంలో నాణ్యమైన వైద్యం, ఆధునిక పరిశోధనలు కుంటుపడుతున్నాయి. మన డాక్టర్ అమెరికాలో ఉంటూ ఇక్కడికి డబ్బు పంపడం వల్ల జీడీపీ పెరగొచ్చు, కానీ దేశ ఆరోగ్య రంగం మాత్రం దివాళా తీస్తుంది. నిరంతరం డబ్బులు అందుతున్న కుటుంబాలలో ఒక రకమైన బద్ధకం, నిష్క్రియత చోటుచేసుకుంటోంది. స్థానికంగా ఉపాధి వెతుక్కోవడం, కొత్త స్టార్టప్‌లు పెట్టాలనే కసి యువతలో తగ్గిపోతోంది. మా అన్నయ్య డాలర్లు పంపుతాడు, మనం కష్టపడాల్సిన అవసరం ఏముంది? అనే పెడధోరణి సమాజానికి చేటు చేస్తుంది. వ్యవసాయ భూములను ప్లాట్లుగా అమ్మేసి, ఆ డబ్బుతో భవనాలు కట్టి, విదేశీ కొడుకు పంపే మనీ ఆర్డర్ కోసం ఎదురుచూసే సోమరితనం పెరుగుతోంది. కుటుంబాలు ముక్కలవుతున్నాయి. భార్యాభర్తలు సుదూర తీరాల్లో విడిపోవడం, పిల్లలు తల్లిదండ్రుల స్పర్శకు దూరంగా క్రెచ్‌లలో పెరగడం, ముసలి తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఒంటరిగా మిగిలిపోవడం. ఇవి కేవలం వ్యక్తిగత సమస్యలు కావు. మన సామాజిక నిర్మాణ పునాదులను కదిలిస్తున్న భూకంపాలు. మన తెలుగు గ్రామాల్లో నిండా రంగురంగుల కొత్త ఇళ్లు ఉన్నాయి, కానీ ఆ ఇళ్లల్లో దీపం పెట్టడానికి వృద్ధులు తప్ప యువత కనిపించని శ్మశాన నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవాస భారతీయ దివస్ పేరిట ఎన్నారైలను ఆకట్టుకోవడానికి పెద్ద ఎత్తున సదస్సులు నిర్వహిస్తోంది. ప్రత్యేక ఎన్నారై పెట్టుబడి సదుపాయాలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటూ ఎర్రకార్పెట్ పరుస్తోంది. ఇవన్నీ వ్యాపార కోణంలో స్వాగతించదగినవే అయినా, మూల సమస్యను ఇవి పరిష్కరించడం లేదు. వలసలను ఎలా ఆపాలి అనే ఆలోచన పక్కన పెట్టి, కేవలం వారి నుండి ఎక్కువ డబ్బు ఎలా గుంజాలి అనే రీతిలో విధానాలు ఉండటం శోచనీయం. రెండు తెలుగు రాష్ట్రాలు ఐటీ, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులు ఆకర్షిస్తున్నప్పటికీ, అవి కేవలం హైదరాబాద్ లేదా వైజాగ్ వంటి నగరాలకే పరిమితమవుతున్నాయి. గ్రామీణ వలసల వేగాన్ని అడ్డుకునే స్థాయిలో ఇక్కడ ఉద్యోగ విప్లవం రావడం లేదు. మనకు కావాల్సింది కేవలం కాల్ సెంటర్ ఉద్యోగాలు కావు. అంతర్జాతీయ స్థాయి వేతన వ్యత్యాసాలను తగ్గించే, పరిశోధనలకు పెద్దపీట వేసే ఒక పటిష్టమైన విద్యా, పారిశ్రామిక వ్యవస్థ. ఈ తీవ్రమైన మేధో, శ్రమ వలసలను అరికట్టడానికి కొన్ని విప్లవాత్మక మార్పులు అవసరం. ప్రవాసులు పంపే నిధులను కేవలం విలాసవంతమైన ఇళ్లకు, వినియోగ వస్తువులకు ఖర్చు చేయకుండా, స్థానిక స్టార్టప్‌లు మరియు కుటీర పరిశ్రమలలో బాండ్లు లేదా షేర్ల రూపంలో పెట్టుబడిగా మార్చేలా పాలసీలు తేవాలి. ఫిలిప్పీన్స్, మెక్సికో దేశాలు ఈ వ్యూహంతోనే రూరల్ ఎకానమీని మార్చేశాయి. విదేశాల్లో అపార అనుభవం గడించిన నిపుణులు మళ్లీ స్వదేశానికి వస్తే, వారి నైపుణ్యాలను ఇక్కడి పరిశోధనలకు వాడుకునేలా మౌలిక సదుపాయాలు, రెడ్ టేపిజం లేని పరిపాలనను అందించాలి. మన పల్లెల్లోనే తక్కువ ఖర్చుతో కూడిన నాణ్యమైన కార్పొరేట్ విద్యా, వైద్య సదుపాయాలు మరియు ఇంటర్నెట్ ఆధారిత ఉపాధి కల్పిస్తే, ఏ ఒక్కరూ వేల మైళ్ల దూరం వెళ్లి పరాయి దేశంలో కన్నీళ్లు కార్చరు. ఈ 135 బిలియన్ డాలర్ల రికార్డు నిజంగానే భారతీయ పౌరుడిగా గర్వపడదగిన విషయమే. మన ప్రవాసులు తాము ఎక్కడ ఉన్నా మాతృభూమిని, కన్నవారిని మర్చిపోలేదని వారి ప్రేమను అంకెల రూపంలో రుజువు చేశారు. కానీ ఆ నోట్ల కట్టల వెనుక ఉన్న నిశ్శబ్ద రోదనను మనం గుర్తించాలి. పరాయి దేశంలో ఒంటరి రాత్రులు గడుపుతూ, పండగలకు పబ్బాలకు కన్నవారికి దూరంగా ఉంటూ, కేవలం మాతృభూమి మట్టి వాసన కోసం తపించే వారి ప్రతి డాలర్ వెనుక ఒక వ్యక్తిగత త్యాగాల హిమాలయం ఉంది. ఆ త్యాగాలకు మనం ఇచ్చే నిజమైన గౌరవం ఒకటే మన బిడ్డలకు మన గడ్డపైనే అన్ని అవకాశాలు కల్పించడం. అప్పుడు వలస వెళ్లడం అనేది ఒక బాధాకరమైన నిస్సహాయత కాకుండా, వారి వ్యక్తిగత ఇష్టం మాత్రమే అవుతుంది. అప్పటివరకు ఈ బిలియన్ డాలర్ల ప్రవాహం పాలకులకు వరంలా కనిపించినా, సమాజ అంతరాత్మను తొలుస్తున్న ఒక పచ్చి గాయం లాంటి ప్రశ్నను మిగులుస్తూనే ఉంటుంది. మన దేశంలోనే సరైన గౌరవం, ఉపాధి ఉంటే మనవాళ్లు పరాయి దేశానికి పోయేవారా? ఈ గాయానికి చికిత్స చేయడమే నేటి పాలకుల, నవసమాజ నిర్మాతల అసలైన బాధ్యత.



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

## ఎడిటర్ వాయిస్

# బడి గంట మోగింది... సెలవులు చాలంది!

బడి గంట గణగణ మోగింది. దాదాపుగా యాభై రోజులకు పైగా సెలవులతో ఎంజాయ్ చేసిన విద్యార్థినీ విధ్యార్థులు ఇక బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని బడి వైపు వేగంగా పరుగులు తీయాల్సిన సమయం ఆసన్నమైంది. ఒకటి నుంచి పదవ తరగతి విధ్యార్థినీ విద్యార్థులు అంతా బడులకు రావాల్సిందే. జూన్ 12 నుంచి యధా ప్రకారం పాఠశాలలు మొదలవుతున్నాయి. ఏప్రిల్ 23 చివరి వర్కింగ్ డేగా గత విద్యా సంవత్సరం ముగిసింది. ఆనాటి నుంచి జూన్ 11 వరకూ సెలవులను రాష్ట్ర విద్యా శాఖ మంజూరు చేసింది. ఇక కొత్త ఏడాదికి శుభారంభం పలుకుతూ షెడ్యూల్ ని రిలీజ్ చేసింది.

**మొత్తం 229 పని దినాలుగా :** ఇదిలా ఉంటే ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యా క్యాలెండర్‌ను తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం పాఠశాలల్లో 229 పనిదినాలు ఉంటాయి. అలాగే 87 ప్రభుత్వ సెలవులు ఉంటాయి. ఇక శనివారాలు తప్పనిసరిగా నో బ్యాగ్ డేస్ గా పరిగణించాల్సి ఉంటుందని విద్యా శాఖ పేర్కొంది. ఏపీలోని పాఠశాలలకు ముఖ్యమైన సెలవు దినాలుగా చూస్తే కనుక దసరా సెలవులు ఈసారి అక్టోబర్ 12 నుండి అక్టోబర్ 21 వరకూ ఉండబోతున్నాయి. అలాగే సంక్రాంతి సెలవులు 2027 జనవరి 11 నుండి జనవరి 17 వరకూ ఉంటాయి. ఎస్ ఏ వన్ పరీక్షలు నవంబర్ 9 నుండి నవంబర్ 20, 2026 వరకూ ఉంటే ఎస్ ఏ 2 పరీక్షలు ఒకటి నుంచి ఎనిమిది తరగతి విద్యార్థులకు 2027 ఏప్రిల్ 3 నుండి ఏప్రిల్ 17, 2027 వరకూ ఉంటాయి. ఇక పదవ తరగతి బోర్డు పరీక్షలు 2027 మార్చి 15 నుండి మార్చి 31 వరకూ నిర్వహిస్తున్నారు.

**ఎండలు ఉండగానే :** ఇదిలా ఉంటే ఏపీలో ఇంకా ఎండలు మండుతున్నాయి. వేసవి ధాటి తగ్గడం లేదు. నైరుతి రుతు పవనాలు కాస్తా ఆలస్యంగా ప్రవేశించినా ఇంకా పూర్తి స్థాయిలో విస్తరించుకోలేదు. దాంతో పాటుగా భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఏపీలో ఉన్నాయి. కురిస్తే భారీ వానలు లేకపోతే నెత్తి మండించే ఎండలుగా వాతావరణం ఉంది. దాంతో కాస్తా ఎండలు ఉండగానే బడికి పిల్లలు వెళ్ళడం అన్నది ఇబ్బందికరమే అయినా అకడమిక్ క్యాలెండర్ దెబ్బ తినకుండా షెడ్యూల్‌ని రిలీజ్ చేశారు. తప్పనిసరిగా పాఠశాలలు తెరచుకుంటున్నాయి. విద్యార్థులు అంతా వెళ్ళాల్సిందే అని అంటున్నారు.



బడికి వెళ్ళే పిల్లలతో ఇక మీదట బిజీ లైఫ్ కొత్త టర్న్ తీసుకోనుంది. అది ప్రతీ ఇంటి నుంచి మొదలు కానుంది. అదే సమయంలో కొత్త విద్యా సంత్సవరంలో మరింత ఎక్కువగా విద్యా ప్రమాణాల మీద రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టి పనిచేస్తోంది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## రోడ్డు ప్రమాదంలో వృద్ధునికి తీవ్ర గాయాలు



### హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలం కోమానపల్లి సెంటర్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో వృద్ధునికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళ్తే అమలాపురం నుండి కాకినాడ వెళ్తున్న AP5Z 0144 నెంబర్ గల కాకినాడ డిపో బస్సు ను ముమ్మిడివరం మండలం కొమనపల్లి వద్ద గుర్తుతెలియని వ్యక్తి ఎదురుగా వస్తున్న బస్సును బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలు పాలైన వ్యక్తిని హుటాహుటిన అంబులెన్స్ లో హాస్పిటల్ కి తరలించారు ఈ ప్రమాద సంఘటనపై అక్కడున్న వారిని విశ్వంవాయిస్ విలేఖరి విచారించగా ఆర్టీసీ డ్రైవర్ తప్పిదం లేదని, వయసులో పెద్దాయన బస్సుకు ఎదురుగా వచ్చి బైక్ మీద బలంగా ఢీకొట్టాడని,ఆ సంఘటన స్థలం లో చూసినవారు చెబుతున్నారు. తీవ్ర గాయాలు పాలైన వ్యక్తి వివరాలు ఇంకా తెలియవలసి ఉన్నది. రోడ్డు ప్రమాద వివరాలు కాకినాడ డిపో మేనేజర్ మనోహర్ విశ్వం వాయిస్ అమలాపురం రూరల్ పత్రిక విలేఖరి ఎడ్ల సురేష్ కుమార్ అడిగి తెలుసుకున్నారు.

## మియాపూర్‌లో విషాదం..



### చిన్నారితో సహా ఆరో అంతస్తు నుంచి దూకిన మహిళ

**మియాపూర్ (హైదరాబాద్), విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని మియాపూర్ పీఎస్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. చిన్నారితో కలిసి ఆరో అంతస్తు నుంచి దూకి మహిళ మృతిచెందింది. మయూరినగర్‌లో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈషా సాహూ (37) అనే మహిళ ఆరు నెలల కుమార్తెను తీసుకుని అపార్ట్‌మెంట్ ఆరో అంతస్తు నుంచి కిందికి దూకేసింది. ఈ ఘటనలో ఈషా అక్కడికక్కడే మృతిచెందగా.. చిన్నారికి స్వల్పగాయాలయ్యాయి. చిన్నారిని స్థానికులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రెండో బిడ్డ జన్మించిన తర్వాత ఈషా తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


## వివాహేతర సంబంధం.. డ్రైవర్‌ను చంపిన యజమాని

**ఒంటిమిట్ట, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్ఆర్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలోని అటవీ ప్రాంతంలో యువకుడి మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. రెండు రోజుల క్రితం అదృశ్యమైన అక్కపల్లె వంశీ (25) మృతదేహాన్ని సోమశిల ముంపు గ్రామం కోటపాడు సమీపంలో పోలీసులు గుర్తించారు. కడపకు చెందిన చింతం రామసుబ్బారెడ్డి వద్ద వంశీ డ్రైవర్‌గా పనిచేశాడు. యజమానే అతడిని చంపినట్లు పోలీసులు వెల్లడించారు. వివాహేతర సంబంధమే ఈ ఘటనకు కారణమని తెలిపారు. వంశీని చంపాక మృతదేహాన్ని రామసుబ్బారెడ్డి కారులో తీసుకెళ్లి పడేసినట్లు చెప్పారు. వంశీ అదృశ్యంపై మూడు రోజుల క్రితం కడప రిమ్స్ పీఎస్‌లో కేసు నమోదైంది.

## దారుణం.. కళాశాల సిబ్బందిపై మాజీ ప్రిన్సిపల్ కుమారుడు కత్తితో దాడి

**చీరాల, విశ్వం వాయిస్ న్యూస్ :** బాపట్ల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. చీరాల మండలం ఈపురుపాలెంలో ఓ ఐటీఐ కళాశాలలో ఘర్షణ జరిగింది. కళాశాల సిబ్బందిపై మాజీ ప్రిన్సిపల్ అబ్దుల్ సత్తార్ కుమారుడు జిలానీ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో కళాశాల కమిటీ మెంబర్ హుస్సేన్ (60), ప్రిన్సిపల్ శేషయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ హుస్సేన్ మృతిచెందారు. గతకొంతకాలంగా ఆర్థిక లావాదేవీల విషయంలో సత్తార్, కమిటీ మెంబర్లకు మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలో శుక్రవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో జరిగిన ఘర్షణ ఓ వ్యక్తి మరణానికి కారణమైంది.

## నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకిన తండ్రి, ఇద్దరు పిల్లలు



**కామారెడ్డి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇద్దరు పిల్లలతో కలిసి తండ్రి.. నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్‌కు చెందిన కృష్ణ (32), కుమారుడు రక్షిత్ (8), కుమార్తె అనన్య (5)తో కలిసి నిజాంసాగర్‌లో దూకారు. బంధువులు ఇచ్చిన సమాచారంతో గాలింపు చేపట్టిన రెస్క్యూ టీమ్.. ముగ్గురి మృతదేహాలను వెలికితీసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కూతురు -పరువు -హత్య

### పరువు కోసం కన్నకూతుర్ని చంపేసిన తల్లిదండ్రులు



**శ్రీకాకుళం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళం జిల్లా సొర్లి గ్రామానికి చెందిన గ్రూప్-1 అభ్యర్థి దుంపల హరిణి (24) హత్య కేసు సంచలనం రేపుతోంది. భర్తకు విడాకులు ఇచ్చి మరో వ్యక్తిని వివాహం చేసుకోవాలనుకున్న హరిణిని ఆమె తల్లి, భర్త, తాత కలిసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం గుండెపోటుతో మరణించినట్లు చిత్రీకరించి అర్ధరాత్రి అంత్యక్రియలు నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ముందుగానే ప్రమాదాన్ని ఊహించిన హరిణి రికార్డు చేసిన సెల్ఫీ వీడియోను ఆమె స్నేహితుడు 'శక్తి యాప్' ద్వారా పోలీసులకు పంపడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. టెక్కలి పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నుంచి టెక్కలి వెళ్లేముందు రికార్డ్ చేసిన ఆ వీడియో చూస్తే ఎవరికైనా బాధతో కళ్లు చెమ్మగిల్లుతాయి. మానవ సంబంధాలు చివరికి ఏ దారికి వెళ్తున్నాయి అర్థం కావడం లేదు.

## వడగాల్పుకు వృద్ధురాలి మృతి



**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వలసపాకల గ్రామానికి చెందిన వింత చిట్టెమ్మ (82) వడగాల్పు కారణంగా మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం నుంచి తీవ్ర నీరసం, అస్వస్థతతో బాధపడుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కన్నుమూసినట్లు పేర్కొన్నారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో నివాసం ఉంటున్న చిట్టెమ్మ ఇటీవల నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల ప్రభావానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వడగాల్పు కారణంగానే ఆమె ఆరోగ్యం క్షీణించిందని, అనంతరం మృతిచెందినట్లు చెప్పారు. వృద్ధురాలి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. మండలంలో కొనసాగుతున్న తీవ్ర ఎండలు, వడగాల్పుల నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## లారీ డ్రైవర్ సజీవ దహనం


### ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టడంతో మంటలు
### మేడిపల్లి వద్ద దగ్ధమైన జొన్న లారీ




**నిర్మల్ గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదిలాబాద్-నిర్మల్ 44వ జాతీయ రహదారిలో నిర్మల్ గ్రామీణ మండలం మేడిపల్లి వద్ద గురువారం వేకువజామున 3 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని ఢీకొని ఆదిలాబాద్ జిల్లా సోనాల మండలం గుట్టపక్క తండాకు చెందిన లారీ డ్రైవర్ పవార్ జవహర్ సింగ్(41) సజీవ దహనమైనట్లు డీఎస్పీ శ్రీనివాస్, ఎస్సై లింబాద్రిలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. సిరికొండ నుంచి జొన్నల లోడ్‌తో ఓ లారీ సిద్దిపేట వైపు వెళ్తోంది. ఆలుగడ్డల లోడ్‌తో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న మరో లారీ మేడిపల్లి వద్ద నిలిచింది. ఈ క్రమంలో ఆగిఉన్న లారీని జొన్నల లోడ్‌తో వెళ్తున్న లారీ వెనక నుంచి ఢీకొనడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. డ్రైవర్ జవహర్‌సింగ్ లారీ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయి సజీవ దహనమయ్యారు. నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఎస్సై లింబాద్రిలు ఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో లారీలను తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య సరోజిని, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పార్కింగ్‌లేని స్థలంలో లారీని నిలిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

# అప్పుల బాధలు, అనారోగ్య సమస్యలు.. వామ్మో ఈ మూడు రాశుల వారు జాగ్రత్త సుమా!

జ్యోతిష్య శాస్త్రంలో శని, కుజ గ్రహాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ రెండు గ్రహాలు చాలా వరకు చెడు ఫలితాలను ఇస్తుంటాయి. కానీ కొన్ని సార్లు ఈ గ్రహాల అనుగ్రహం ఉంటే మాత్రం ఆ రాశుల వారి పంట పండినట్లే. అయితే అతి త్వరలో కుజ గ్రహం సంచారం చేయనుంది. అంతే కాకుండా శని గ్రహంతో సంయోగం చెందనుంది. ఇది అనేక రకాల సమస్యలకు కారణం కానున్నదంట. దీని గురించి ఇప్పుడు మనం వివరంగా తెలుసుకుందాం. శని గ్రహాన్ని న్యాయ గ్రహం అని పిలుస్తారు. కర్మల ఫలితంగా ఇది ఫలితాలను ఇస్తుంది. ప్రస్తుతం శని గ్రహం మీన రాశిలో సంచారం చేస్తుంది. ఈ క్రమంలోనే ఏప్రిల్ నెలలో కుజ గ్రహం రాశి సంచారం చేయనుంది. ఇది మీన రాశిలోకి ప్రవేశించనుంది. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఇది చాలా తీవ్రమైన పరిమాణాన్ని సృష్టిస్తుంది. దాదాపు కుజ గ్రహం 18 నెలలపాటు మీన రాశిలోనే సంచారం చేయనుంది. అయితే ఇది 12 రాశులపై దాని ప్రభావం చూపుతుందంట. ముఖ్యంగా మూడు రాశుల వారిపై మాత్రం చాలా చెడు ప్రభావం చూపున్నదంట. ఇంతకీ ఆ రాశులు ఏవి అంటే? కుజ గ్రహం ఏప్రిల్ 2న మీన రాశిలోకి ప్రవేశించి, శని గ్రహంతో సంయోగం చెందుతాడు. అయితే ఇది చాలా తీవ్రమైన సమస్యలకు కారణం అవుతుందంట. ముఖ్యంగా మేష రాశి, కన్యా రాశి, మీన రాశి వారికి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా



అనేక సమస్యలు సృష్టిస్తుందంట. అందుకే ఈ మూడు రాశుల వారు కుజ, శని గ్రహాల సంయోగం సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు జ్యోతిష్య శాస్త్ర నిపుణులు. ఇంతకీ ఆ రాశులు ఏవి అంటే?

**మేష రాశి :** మేష రాశి వారికి మానసిక ఒత్తిడి పెరుగుతుంది. ఏ పని చేసినా కలిసి రాదు, పని మధ్యలో ఆగిపోయే ఛాన్స్ ఉంది. అంతే కాకుండా అనారోగ్య సమస్యలు అధికం అవుతాయి. అనుకోని ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఇవి లాభం కంటే నష్టాన్నే ఎక్కువ మిగుల్చుతాయి. అనేక రకాలుగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

**కన్యా రాశి :** కన్యా రాశి వారికి శని, కుజ గ్రహాల సంయోగం అనేక ఇబ్బందలను, ఒడిదొడుకులను తీసుకొస్తుంది. పనిలో నిర్లక్ష్యం ఎక్కువగా ఉంటుంది. పని చేయాలనే ఆలోచనే ఉండదు. కుటుంబంలో కలహాలు మానసిక స్థితిని ప్రభావితం చేస్తాయి. వైవాహిక జీవితం చాలా దారుణంగా ఉంటుంది. ప్రతి పనిలో అసంతృప్తి ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా విద్యార్థులు కూడా కష్టానికి తగిన ఫలితం పొందలేరు. అలసట, నీరసం ఎక్కువగా ఉంటుంది. మాటపట్టింపుల వచ్చే ఛాన్స్ ఉంది. పై అధికారులతో మాట్లాడే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించడం మంచిది.

**మీన రాశి :** మీన రాశి వారు వ్యాపారంలో ఎక్కువగా నష్టాలు ఎదుర్కొంటారు. నిరుద్యోగలుకు ఉద్యోగం పొందడం కలగానే మిగిలిపోతుంది. పనుల్లో ఆటంకాలు అధికం అవుతాయి. అప్పుల బాధలు వేధిస్తాయి. అనారోగ్య సమస్యల కోసం ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఉద్యోగంలో పని ఒత్తిడి అధికం అవుతుంది. అయినా కష్టానికి తగిన ఫలితం లభించదు.

# ప్రజలకు పొడిచిన వెన్నుపోటుకు రెండేళ్లు

## తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ - మండుటెండలో భారీగా పాల్గొన్న కార్యకర్తలు ప్రజలు

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రజలకు గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ అమలు చేయని సీఎం చంద్రబాబు, ఈ రెండేళ్లలో ప్రజలను వెన్నుపోటు పొడిచారని రాష్ట్ర సబ్ ఆర్డినేట్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు.వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండపేట లో భారీ మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తొలుత మండపేట విజయలక్ష్మి నగర్ లోని వైసిపి కార్యాలయం నుండి మూడు మండలాలు, టౌన్ నుండి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు అభిమానులు తరలివచ్చారు. ర్యాలీ నీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. రాజారత్న సెంటర్ వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం కు పూల మాలలు వేసి నివాళు లు అర్పించారు. ఇందులో భాగంగా చంద్రబాబునాయుడు కి సంబంధించిన సూపర్‌సిక్స్‌తో సహా, మ్యానిఫెస్టో కాపీ, పవన్‌కల్యాణ్, చంద్రబాబునాయుడు ఫొటోలతో సంతకాలు చేసి, ప్రతి ఇంటికి పంపించిన బాండ్ల కాపీలు చూపిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. డీఎస్సీ-2025లో జరిగిన అక్రమాలు, అవకతవకలను ప్రస్తావిస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం మెయిన్ రోడ్, కరాచీ సెంటర్, కలువపువ్వు సెంటర్, కేపీ రోడ్డు, రథం సెంటర్, రావి చెట్టు జంక్షన్, తహసీల్దార్ కార్యాలయం కు చేరుకున్నారు. అక్కడ వినతి పత్రాలు అందజేశారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా కార్యకర్తలు అభిమానులు ర్యాలీ లో పాల్గొనడం విశేషం.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు విజయవంతం అయ్యాయని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ డీఎస్సీలో నియమాలు ఇష్టానుసారం మార్చి, కొత్తగా జీఓలు జారీ చేసి, స్పోర్ట్స్ కోటా పోస్టులు అడ్డగోలుగా భర్తీ చేసినట్లు ఆరోపణలు చేశారు. దీంతో అన్యాయానికి గురైన డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన చెందుతుండగా డీఎస్సీ-2025పై సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలనను పూర్తిగా పక్కనబెట్టి, ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తూ రాష్ట్రాన్ని ఒక 'జంగిల్ రాజ్'గా మార్చేశారని ఆయన మండిపడ్డారు. ఈ రెండేళ్ల కాలంలో ప్రజలకు పలానా మంచి చేశానని ధైర్యంగా చెప్పుకునే పరిస్థితి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఏ కోశానా లేదని, ప్రభుత్వ ప్రోగ్రెస్ రిపోర్ట్ చూస్తే అత్యంత ఘోరంగా ఉందని విమర్శించారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పక్కనబెట్టి "బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ" అన్న నానుడిని చంద్రబాబు ప్రతిరోజూ తన వైఫల్యాలతో రుజువు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఎల్లో గ్యాంగ్‌తో కలిసి వైసీపీని ఒక భూతంలా చూపే కుట్రపూరిత ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, అమరావతికి ప్రత్యామ్నాయంగా తాము అత్యంత ప్రాక్టికల్‌గా ఉండే 'మావిగన్' ప్రాంతాన్ని జగన్ రాజధాని కారిడార్‌గా ప్రతిపాదించారని వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనే పెట్రో ధరలు అధికమని, తాము అధికారంలోకి రాగానే వాటిని తగ్గిస్తామని నాడు ప్రకటించిన ప్రస్తుత సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు, మంత్రి నారా లోకేష్ వెంటనే ఆ పని చేయాలని డిమాండ్ చేశారు. నాడు పెట్రో ధరలు ప్రస్తావిస్తూ, నానా హంగామా చేసిన తండ్రీ కొడుకులు, ఇప్పుడు ఆనాటి మాదిరిగా పెట్రోల్ బంక్‌ల ముందు సెల్ఫీ దిగే దమ్ముందా? అని ఆయన సవాల్ చేశారు. రెండేళ్ల చంద్రబాబు పాలనంతా అబద్ధాలు, అప్పులు, మోసాలే అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక, పాలన చేత కాక రెండేళ్లలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ



లేదని విమర్శించారు. అందుకే చెప్పుకోవడానికి ఏమీ లేక, డ్రామాలు, రీల్స్‌తో సీఎం చంద్రబాబు కాలక్షేపం చేస్తున్నారని తోట త్రిమూర్తులు ఆక్షేపించారు. చంద్రబాబుకి 28 జిల్లాల ఏపీ కన్నా 29 గ్రామాల అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారమే ముఖ్యమని దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు ప్రజలకు మాయమాటలు చెప్పి, వారిలో భ్రమలు కల్పించి తప్పుడు హామీలతో చంద్రబాబు ఎలాగైతే అధికారంలోకి వచ్చాడో, గడిచిన రెండేళ్లుగా అవే అబద్ధాలను, మోసాలతోనే పాలన సాగిస్తున్నాడనీ ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం చేతకాక, వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి జగన్‌పైనా, వైసిపి పార్టీపైనా దుష్ప్రచారంతో కాలక్షేపం చేస్తున్నారని తెలిపారు. రెండేళ్ల పాలనలో చేసిందేమీ లేకపోయినా మీడియా పబ్లిసిటీతో హడావుడి చేస్తున్నరని విమర్శలు చేశారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోల్ డీజిల్ చార్జీల భారంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే చంద్రబాబు మాత్రం పబ్లిసిటీ కోసం వీడియోలు చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారనీ చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోపై తోట త్రిమూర్తులు వరుస ప్రశ్నలు సంధించారు. ఏడాదికి ప్రతి మహిళకు రూ.15 వేలు ఇస్తామన్నారనీ, ఆ 'ఆడబిడ్డ నిధి' పథకం ఏమైందన్నారు. రాష్ట్రంలోని యువతకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఊసే లేకుండా పోయిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక విపరీతంగా పెంచేశారన్నారు.ప్రజలు, ప్రతిపక్షాలు తమకు ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేక చంద్రబాబు నాయుడికి బీపీ (రక్తపోటు) పెరిగిపోతోందని తోట ఎద్దేవా చేశారు. హామీలను పక్కనబెట్టి ప్రజలను వంచించడమే కూటమి ప్రభుత్వ యాక్షన్ ప్లాన్ గా మారిందని ఆయన విమర్శించారు.ఈ కార్యక్రమంలో వైసిపి నియోజక వర్గం పరిశీలకులు ఒంటెద్దు వెంకన్న నాయుడు, మాజీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి,ఎంపీపీ జిత్తుగ వెంకట లక్ష్మి , మాజీ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ రాజబాబు, రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్న బాబు, టౌన్ వైసిపి ప్రెసిడెంట్ పిల్లి శ్రీనివాస్, మాజీ విప్ పోతంశెట్టి ప్రసాద్, రాష్ట్ర వైసిపి ఎస్సీ సెల్ జాయింట్ సెక్రెటరీ వల్లూరి రామకృష్ణ, జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, రాష్ట్ర వైసిపి బిసి కార్యదర్శి యంగ్ర బుజ్జీ, మాజీ షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అలీఖాన్ బాబా, మాజీ కౌన్సిలర్స్ మందపల్లి రవి కుమార్, ముమ్మిడివరపు బాపిరాజు, మరిశెట్టి సత్యనారాయణ, మెండు బాపిరాజు, టేకిమూడి శ్రీను ,ముక్కా సుబ్రహ్మణ్యం, కొల్లు వరలక్ష్మి, కనికెళ్ళ పల్లవి ప్రసాద్, ముక్కా దాలయ్య నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, మండల వైసిపి కన్వీనర్స్ అడబాల బాబ్జీ,గూటం సత్యనారాయణ, వెలగల సత్యనారాయణరెడ్డి, పెదపాటి సత్యనారాయణమూర్తి, జిల్లా వైసిపి కార్యదర్శి టేకిమూడి శ్రీనివాస్ , జిల్లా వైసిపి కార్యదర్శి గుడిమెట్ల శివ రామకృష్ణ (రాంబాబు), జిల్లా వైసిపి అధికారిక ప్రతినిధి సిరిపురపు శ్రీనివాసరావు, గారపాటి అశోక్ కుమార్ , ఓగిరాల దేవి, లాజర్, వాసిరెడ్డి అర్జున్, బూత్ కన్వీనర్ సురపురెడ్డి సత్య ప్రసాద్, శ్రీ శ్రీ, ఈదల సింహాచలం, మలువలస గణపతి, తోరం శ్రీను, గాంధీ, పెంకే వెంకటరావు, పలివెల మధు, పి. సత్యనారాయణ, ఆంజనేయులు, సత్తి సత్తిబాబు, యారామటి వెంకన్న బాబు, ఎర్రగుంట అయ్యప్ప, సాధనాల శివ భగవాన్, సయ్యద్ మైనర్ బాబు, గొలుగూరి సందీప్ రెడ్డి, లేగ వెంకన్న, షేక్ గౌస్, పోతుల ప్రసాద్, కోణాల చంద్ర బోస్, సన్మాల ధనరాజు, కొనగళ్ళ భాస్కర రావు,అబ్బిశెట్టి వెంకటేశ్వర రావు,అబ్బిరెడ్డి వీర్రాజు,పోతం సెట్టి సత్యన్రాయణ రెడ్డి, తణుకు అశోక్ కుమార్,శాఖ సత్యనారాయణ,పెరబత్తుల రామకృష్ణ, పంద్రింకి మహేష్, పాలికా గోవిందు, బిసి సెల్ అధ్యక్షుడు పాలిక శ్రీను, వైసిపి మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ వల్లి సాహెబ్, వైసిపి ఎస్ టి సెల్ అధ్యక్షుడు సమతం పాపారావు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కొనగళ్ల భాస్కర రావు,వైసిపి ఎస్ సి సెల్ అధ్యక్షుడు నక్కా సింహాచలం, వైసిపి డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు గంగుమల్ల రాంబాబు, వైసిపి బూత్ కమిటీ విభాగం పోతుల వీర వెంకట సత్య దుర్గా ప్రసాద్, వాణిజ్య విభాగం వైసిపి అధ్యక్షురాలు పలుకూరి వెంకన్నబాబు, వైఎస్సార్ టి ఎన్ టి అధ్యక్షుడు గంధం సూరిబాబు, వైసిపి వికలాంగుల విభాగం అధ్యక్షుడు మోర్త ప్రసాద్ బాబు, వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు అబ్బిరెడ్డి వీర్రాజు, వైసిపి ఐటీ వింగ్ ప్రెసిడెంట్ యరామటి వెంకన్నబాబు, వైసిపి సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు జొన్నపల్లి సత్తిబాబు, మేధావుల వేదిక కర్రి అయ్యప్ప రెడ్డి, వైసిపి పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు పసుమర్తి నాగేశ్వరావు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు వంగ శ్రీనివాస రావు, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు మందపల్లి రవి, వాలంటీర్ విభాగం అధ్యక్షుడు తమ్మర్సి జగపతి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు పలివేల మధు, కొల్లా శ్రీనివాసులు, బండేల సత్య సాయిరాంతవిటికి రత్న కుమార్, వీర కిరణ్ కుమార్ గౌడ్, నామల జానకి రామయ్య, చీకట్ల సుబ్బా రావు, చింతా సురేష్ రెడ్డి, యారమాటి వెంకన్నబాబు, సన్మాల ధనరాజు, శిరంగి శ్రీనివాసు, షేక్ మేరా సాహెబ్, కుక్కల శ్రీనివాసు, రెడ్డి రత్తయ్య, కొడమంచిలి బాస్కర్ రావు, దుగ్గిరాల వీరబాబు, నాగులాపల్లి ఈశ్వరరావు, , తీగిరెడ్డి రాము, పొలమురి వీర దుర్గా ప్రసాద్, కోళ్ళ అయ్యప్ప, గునిపే నాగభూషణం, మెండి మురళి కృష్ణ, పొలమాల సత్తిబాబు, మాదాబత్తుల వెంకటరమణ, కాటా భవానీ, కమ్మిలి సుధాకర్, పుట్ట సత్యనారాయణ, గుతం సత్యనారాయణ, సలాది వీరబాబు, కొప్పిశెట్టి రామ్ కిషోర్, రాయుడు జగపతి రామయ్య, అతికేళ శంభు లింగం, కోలపల్లి గోపాలకృష్ణ, సిద్ధాంతపు దొరబాబు, సాడే కృష్ణయ్య, బోడుమిల్లి సాయి కుమార్, వీడి గంగాధర్, పితాని సత్యనారాయణ, రైతు విభాగ ఉపాధ్యక్షులు కొవ్వూరు త్రినాధ్ రెడ్డి, రాష్ట్ర అన్ని గ్రామాల పార్టీ ప్రెసిడెంట్లు వార్డు నెంబర్స్, కౌన్సిలర్సు, అనుబంధ విభాగాల ప్రెసిడెంట్లు, పార్టీ నాయకులు, అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్‌ను తిరుపతి సభలో కలిసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

## సుపరిపాలనకు రెండేళ్లు... స్వర్ణాంధ్ర నిర్మాణానికి ప్రజల మద్దతు!





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతిలో శుక్రవారం ఘనంగా నిర్వహించిన "సుపరిపాలన - స్వర్ణాంధ్ర రెండేళ్ల విజయోత్సవ సభ" రాష్ట్ర రాజకీయ చరిత్రలో మరో ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఈ మహాసభకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేశారు. ఈ సభకు హాజరైన రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సభ అనంతరం రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ని, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని కలిశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర అభివృద్ధి, రాజమహేంద్రవరం నగరానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన, ప్రజా సంక్షేమ అంశాలపై కొద్దిసేపు చర్చించారు. రాష్ట్ర పురోగతిలో ప్రాంతీయ అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని నాయకులు పరస్పరం చర్చించుకున్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో అందిస్తూ కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతోందని నాయకులు పేర్కొన్నారు.

### విద్యా ప్రమాణాలు పెంచడంలో

# ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది

**విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

**ఈ విద్యా సంవత్సరంలో రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలి - ఉపాధ్యాయులకు డివైఈవో రామలక్ష్మణ మూర్తి సూచనలు**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పది ఫలితాలలో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉత్సాహపరచడమే లక్ష్యంగా సన్మాన సత్కారాలను నిర్వహించినట్లు రామచంద్రపరం డివిజన్ డివైఇఓ రామలక్ష్మణ మూర్తి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలోని శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో జిల్లా పది ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులు, విద్యార్థులను డివిజనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవైఈఓ) పి. లక్ష్మణమూర్తి అధ్యక్షతన శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతిష్టాత్మక పది ఫలితాలలో 100 శాతం సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండలంలో మొదటి, రెండవ, మూడవ సాధించిన విద్యార్థులతోపాటు, వివిధ సబ్జెక్టులలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని డీవైఈఓ అభినందిస్తూ తదుపరి విద్యా సంవత్సరానికి రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీపీ నౌడు వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు (చిన్ని) మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు నేర్పించి, వారు ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మిఠాయిలు పంచి


# సంబరాలు చేసిన దశాబ్దాల అభిమానం

**కాంగ్రెస్ పరిపాలనలోనూ తెలుగుదేశం తరపున తెగించి నిలబడిన కార్యకర్తగా ప్రసిద్ధి**





**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నాటి నుంచి పార్టీ సిద్ధాంతాలను గుండెల్లో పెట్టుకుని నడిచిన కార్యకర్తగా ఏ.పీ.పీ. రామారావు ప్రత్యేక గుర్తింపు పొందారు. 1983 నుంచి తెలుగుదేశం పార్టీ అభిమానిగా, కార్యకర్తగా కొనసాగుతూ కాంగ్రెస్ పాలనలోనూ ఏమాత్రం వెనుకడుగు వేయకుండా రాయవరంలో పార్టీ జెండాను ఎగురవేసిన వ్యక్తిగా స్థానికంగా పేరు సంపాదించారు. రాష్ట్రంలో కూటమి ద్వారా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన శుక్రవారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఆశయాలు, ప్రజా సంక్షేమానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఎ.పి.పి రామారావు కుమారుడు జయకృష్ణ (జెకె) తన స్నేహితులతో కలిసి ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక ప్రముఖులు, ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేసి ఆనందోత్సాహాల మధ్య వేడుకలు నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

### అమలాపురంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి

# శరవేగంగా ఐదు ప్రధాన వంతెనల నిర్మాణం

**ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలిసి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**
**వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఐదు ప్రధాన వంతెనల నిర్మాణ పనులను శరవేగంగా చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక శాసనసభ్యుడు అయితాబత్తుల ఆనందరావుతో కలిసి ఇందుపల్లి, నల్లచంద్రావు ఘాట్, కామనగరువు (రెండు వంతెనలు), సవరపాలెం, చల్లపల్లి పరిధిలో నిర్మాణంలో ఉన్న వంతెన పనులను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకోవడానికి కాలువలు దాటాల్సిన పరిస్థితి ఉందన్నారు. జిల్లా కేంద్రం ఏర్పడక ముందు కేవలం నల్ల వంతెన, ఎర్ర వంతెనలు మాత్రమే ఉండేవని తెలిపారు. జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన తర్వాత పెరిగిన ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే ఈదరపల్లి వద్ద నూతన వంతెనను నిర్మించామన్నారు. గతంలో ఈదరపల్లి వంతెన వద్ద ఉదయం 8 గంటల నుంచి 11:30 గంటల వరకు తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఉండేదని చెప్పారు. ప్రస్తుత ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు స్థానిక శాసనసభ్యుడు ప్రత్యేక చొరవ తీసుకుని, ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రుల సహకారంతో రాష్ట్రాల మూలధన పెట్టుబడి ప్రత్యేక సహాయ పథకం నిధులు, సి.ఎస్.ఆర్. నిధులను మంజూరు చేయించారని కలెక్టర్ తెలిపారు. రోడ్లు ఎంత ముఖ్యమో, కాలువలపై వంతెనలు కూడా అంతే ముఖ్యమని భావించి ఈ నిర్మాణాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ వంతెనల నిర్మాణం పూర్తయితే నగరంలోని ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గిపోతాయని స్పష్టం చేశారు. పనులను వేగవంతం చేసేందుకు పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, జలవనరుల శాఖ, ఏపీఈపీడీసీఎల్ ఇంజనీరింగ్ అధికారులు పూర్తి సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. శాసనసభ్యుడు అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యల నిర్మూలనకు మొత్తం తొమ్మిది వంతెనలను ప్రతిపాదించామని, అందులో ఐదు వంతెనల నిర్మాణాలను రాష్ట్రాల మూలధన పెట్టుబడి ప్రత్యేక సహాయ నిధులు, సి.ఎస్.ఆర్. నిధులతో చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరో వంతెన నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల సహకారంతో అమలాపురంలో సంపూర్ణ వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సవరపాలెం వద్ద నేరుగా వెళ్లే విధంగా రెండు వంతెనలను నిర్మించడం ద్వారా 30 శాతం ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని, అలాగే పరంజ్యోతి ప్రాంతం వైపు నుంచి వచ్చే 70 శాతం ట్రాఫిక్ సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. ఈ వంతెనలు అందుబాటులోకి వస్తే ఎర్ర వంతెన వద్ద భవిష్యత్తులో ఎదురెదురు ట్రాఫిక్ సమస్యలు తలెత్తవని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ రాంబాబు, ఆర్ అండ్ బి ఈఈ బి.రాము, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### 'వెన్నుపోటుకు రెండేళ్లు' కూటమి ప్రభుత్వ మోసాలపై

# నిరసన కార్యక్రమం చేపట్టిన చిర్ల జగ్గిరెడ్డి


**డీఎస్సీ, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయి**
**రైతుకు పెట్టుబడి సాయం, 50 ఏళ్లకే పెన్షన్ హామీలపై నిలదీత**
**మద్యం, నిత్యావసర ధరలు, ఇసుక సమస్యలతో ప్రజలపై భారం**




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ పరిపాలనా వైఫల్యాలను నిరసిస్తూ "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు పాటి శివకుమార్ పాల్గొన్నారు. ఈరోజు ఉదయం 8:30 గంటలకు రావులపాలెం డిగ్రీ కళాశాల గ్రౌండ్ నుండి రావులపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. కొత్తపేట నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, చిర్ల అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని నాయకులు విమర్శించారు. మెగా డీఎస్సీ, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, రైతుకు పెట్టుబడి సాయం, 50 ఏళ్లకే పెన్షన్ వంటి కీలక హామీలు నేటికీ అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మద్యం విధానం, గ్యాస్, వంటనూనె, పెట్రోల్, డీజిల్ వంటి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇసుక, మట్టి సమస్యలతో నిర్మాణ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికే "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

### నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో

# అభివృద్ధి పరుగులు తీస్తోంది




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో జరుగుతున్నది ప్రజా పాలన స్వర్ణాంధ్ర దిశగా సాగుతున్న ప్రస్థానం సంక్షేమం ప్రజలకు భరోసా ఇస్తుంది. అభివృద్ధి భవిష్యత్తుకు బాటలు వేస్తుంది సుపరిపాలన ప్రజల నమ్మకాన్ని గెలుస్తుంది అందుకే ఇది కేవలం ప్రభుత్వం కాదు. ప్రజల ప్రభుత్వం ఇది కేవలం పాలన కాదు. స్వర్ణాంధ్ర 2047 దిశగా సాగుతున్న ప్రస్థానం రెండేళ్ల క్రితం రాష్ట్రం ఎదుర్కొన్న పరిస్థితికి భిన్నంగా నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కనిపిస్తుంది. ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి సంక్షేమానికి కొత్త నిర్వచనం ఇచ్చింది. 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్లతో "తల్లికి వందనం" అందించింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా 71 కోట్ల ప్రయాణాలకు అవకాశం కల్పించింది. రైతులకు "అన్నదాత సుఖీభవ" ద్వారా రూ.8,985 కోట్లు అందించింది. ఎన్టీఆర్ భరోసా కింద రూ.65 వేల కోట్లకు పైగా పింఛన్లు పంపిణీ చేసింది. 5.5 లక్షల ఇళ్లు పంపిణీ చేసి, మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అమరావతిని శాశ్వత రాజధానిగా నిలబెట్టే దిశగా చారిత్రాత్మక ముందడుగు వేసింది. రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతో ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఏపీ వైపు మళ్లించింది. విశాఖలో గూగుల్ ఏ వన్ డేటా సెంటర్, అమరావతి లో క్వాంటమ్ వ్యాలీ, రాయలసీమలో సెమీకండక్టర్ & డిఫెన్స్ పరిశ్రమలకు మార్గం సుగమం చేసింది. 20,060 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులు చేసి, వేల కోట్లతో కొత్త రహదారుల నిర్మాణం ప్రారంభించింది. పోలవరం, వెలిగొండ, నేరడి, చింతలపూడి వంటి ప్రాజెక్టులకు వేగం తీసుకొచ్చింది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 1,035 సేవలను ప్రజల అరచేతిలోకి తీసుకొచ్చింది. గంజాయి, డ్రగ్స్ మాఫియాపై ఈగల్ టాస్క్ ఫోర్స్‌తో ఉక్కుపాదం మోపింది. విద్య, వైద్యం, విద్యుత్, నీటి నిర్వహణ, గ్రామీణాభివృద్ధి, పారిశ్రామికీకరణ – ప్రతి రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. కొత్తపేట నియోజకవర్గంలోనూ శాసనసభ్యుడు బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ముత్యాల బాబ్జి జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు. గనిశెట్టి వీరేష్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కడలి భీమేశ్వరరావు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బూసి భాస్కర రావు, క్లస్టర్ కో ఇంఛార్జి అద్దంకి చంటిబాబు తదితరులు పేర్కొన్నారు.

### కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై

# అమలాపురంలో భారీ బైక్ ర్యాలీ



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 'సూపర్ సిక్స్' సహా ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని మాజీ మంత్రి, ప్రజా ఖాతాల కమిటీ సభ్యుడు, అమలాపురం పార్లమెంట్ సమన్వయకర్త పినిపే విశ్వరూప్ విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వంచన, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అమలాపురంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పినిపే విశ్వరూప్ అధ్యక్షతన, అమలాపురం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పినిపే శ్రీకాంత్ నేతృత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీకి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున బైక్‌లపై తరలివచ్చారు. పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలను ఆకర్షించేందుకు ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీలను ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించిందన్నారు. రెండేళ్ల పాలనలో ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, ఏ ఒక్క వర్గానికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయేల్, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అమలాపురం పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, మాజీ పార్లమెంట్ సభ్యురాలు చింతా అనురాధ, పట్టణ అధ్యక్షుడు సంసాని నాని, మండల అధ్యక్షులు బద్రి బాబ్జి, గుత్తుల చిరంజీవి, కొనుకు బాపూజీతో పాటు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చెరువులో పడి మత్స్యకారుడు మృతి



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండలం గెద్దనపల్లికి గ్రామంకు చెందిన పాలెపు బైరవ స్వామి(45) గెద్దనపల్లి గ్రామంలో ఉన్న చెరువులో చేపలను వేటాడుతూ చెరువులో మునిగి చనిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే కాట్రేనికోన ఎస్ఐ అవినాష్, వీఆర్వో పెద్దయ్య, గ్రామ పెద్దలు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. భార్యకువైట్ దేశంలో ఉంటుంది. ఇద్దరు అమ్మాయిలు కాకినాడలో చదువుతున్నట్లు సమాచారం.

# వాడపాలెంలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు

**ప్రజలకు పాలనను మరింత దగ్గర చేయడమే ప్రజా దర్బార్ లక్ష్యం**




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తేనే ప్రజల సమస్యలకు సమగ్ర పరిష్కారం లభిస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే బండారు స్వయంగా ప్రజలతో మమేకమై వారి వద్ద నుంచి వినతులు, అర్జీలు స్వీకరించారు. ప్రభుత్వం ప్రజలకు మరింత దగ్గరగా ఉంటూ, వారి అవసరాలు, సమస్యలు తెలుసుకోవాలని, వెంటనే చర్యలు తీసుకోవాలనే సంకల్పాన్ని ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రతిబింబిస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 24 వినతులు వచ్చాయన్నారు.

### షర్మిలా వ్యాఖ్యలు నిరాధారం

# కేంద్ర ప్రభుత్వ కృషిని గుర్తించాలి

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్**




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి ఇటీవల భారతీయ జనతా పార్టీ మరియు కేంద్ర ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం అమలాపురంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 సంవత్సరాలుగా దేశం అన్ని రంగాల్లో విశేష అభివృద్ధి సాధించిందని అన్నారు. ప్రపంచంలోనే భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదగడం మోదీ దూరదృష్టి పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, స్టార్టప్ ఇండియా, స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్, ఉజ్వల యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన వంటి అనేక పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకువచ్చారని తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై భారతదేశ ప్రతిష్ఠను మరింత పెంచి, ప్రపంచ దేశాలు భారత నాయకత్వాన్ని గౌరవించే స్థాయికి తీసుకెళ్లిన ఘనత మోదీదేనని అన్నారు. ప్రజా సంక్షేమం, జాతీయ భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ లబ్ధికే ప్రాధాన్యత ఇచ్చే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఇప్పటికే తగిన గుణపాఠం చెప్పారని విమర్శించారు. రాబోయే రోజుల్లో దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీని పూర్తిగా తిరస్కరించే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. షర్మిలా రెడ్డి వాస్తవాలను విస్మరించి రాజకీయ విమర్శలు చేయడం మానుకుని, దేశాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తించాలని నల్లా పవన్ కుమార్ సూచించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే నిరాధార ఆరోపణలకు బదులుగా నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చికిరిమెల్లి శ్రీనివాస్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు కోనా సత్యనారాయణ, అమలాపురం పట్టణ పార్టీ అధ్యక్షుడు అయ్యల భాషా, నాయకులు సంసాని రత్నకుమార్, డీవీఎస్ రాజు, మాకిరెడ్డి మనోజ్, బండి శ్రీనివాస్, మన్నె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మన బడి - మన పండుగ కార్యక్రమం



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు మన బడి - మన పండుగ కార్యక్రమం పరిశీలనలో భాగంగా జిల్లా పరిషత్ హై స్కూల్ బ్రహ్మ సమేధ్యం పాఠశాలను సందర్శించి, అడ్మిషన్ పొందిన 1వ తరగతి మరియు 6వ తరగతి విద్యార్థుల వివరాలు అడుగుట జరిగినది. ఈ రోజు పాఠశాలకు హాజరైన విద్యార్థులందరికీ డిఈఓ, మండల విద్యాశాఖాధికారి ఎమ్.వెంకటరమణ మరియు ఉపాధ్యాయులచేతుల మీదుగా టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది మరియు స్టాఫ్ మీటింగ్ ఏర్పాటుచేసి 2025-26 విద్యాసంవత్సరం ఎస్ ఎస్ సి ఫలితాలలో 100 ఉత్తీర్ణత సాధించినందుకు స్టాఫ్ ను అభినందించుట జరిగినది మరియు ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్స్ ఇంకనూ పెరిగేలా కృషి చేయాలని సిబ్బందిని కోరారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం మెనూ, క్వాలిటీ క్వాంటిటీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు అలాగే డి ఈ ఓ చేతుల మీదుగా విద్యార్థులకు వడ్డించుట జరిగింది అనంతరం జిల్లా పరిషత్ హై స్కూల్ కందికుప్ప పాఠశాలను కూడా సందర్శించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించి అందరూ క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని మరియు అందరికీ టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్ ఇచ్చారాఅనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు అనంతరం ఆయన చేతులమీదుగా బుక్స్ పంపిణీ చేయడం జరిగింది.

# పోలీస్ సిబ్బంది సంక్షేమమే మా ప్రాధాన్యత : జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ప్రత్యేకంగా "ఎస్పీ సంపర్క్" కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది తమ వ్యక్తిగత, వృత్తిపరమైన సమస్యలను మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు ఫోన్ ద్వారా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది తమ బదిలీలు, సెలవులు, ఆరోగ్య సమస్యలు, ఇతర సేవా సంబంధిత ఇబ్బందులను వివరించారు. ప్రతి ఒక్కరి సమస్యను శ్రద్ధగా విన్న ఎస్పీ, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేలా సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఎస్పీ తెలిపారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, భద్రత తమ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. సిబ్బంది మానసిక ప్రశాంతతతో ఉన్నప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలరని, అందుకే వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
కాకినాడ జిల్లా ఎడిషన్
శనివారం, 13 జూన్ 2026
www.viswamvoice.com


### ఇకపై రైతులు ఎరువులను

# అంతర్జాలంలోనూ కొనొచ్చు...!

**అందుబాటులోకి వచ్చిన చరవాణీ అనువర్తనం - ఎరువుల క్రయ విక్రయాలు అంతా పారదర్శకమే**

**ఆన్లైన్లో బుక్ చేసి దుకాణాల్లో ఎరువులను పొందొచ్చు - భూముల కౌలు రౌతులకు కూడా అదవకాశం**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎరువుల (యూరియా, డీఏపీ) అక్రమ రవాణాను, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వాలు మొబైల్ యాప్‌లను అందుబాటులోకి తెచ్చాయి. వీటి ద్వారా రైతులు తమకు కావలసిన ఎరువులను పారదర్శకంగా, సులభంగా కొనుగోలు చేయవచ్చు. ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి అగ్రికల్చర్ ప్రొడ్యూస్ అండ్ ఇన్‌పుట్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏపిఐఐఎంఎస్ 2.0) అనువర్తనంను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ప్రభుత్వ 'వెబ్‌ల్యాండ్' తో అనుసంధానమై ఉంటుంది. దీని ద్వారా రైతులకు ఎంత భూమి ఉంది, ఏ పంట వేశారు, శాస్త్రీయంగా ఎంత మోతాదులో ఎరువులు అవసరం అనే వివరాలను బట్టి ఎరువులను కేటాయిస్తారు. రైతులు తమ ఆధార్ నంబరు నమోదు చేసి, సమీపంలోని డీలర్ లేదా అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా ఎరువులు పొందవచ్చు. రైతులు క్యూ లైన్లలో నిలబడకుండా, తమ ఇంటి నుంచే యూరియాను బుక్ చేసుకునే సదుపాయం ఉంది. వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోలు) సేకరించిన క్రాప్ బుకింగ్ డేటా ఆధారంగా ఎరువులు పంపిణీ చేస్తారు. ఈ యాప్ ద్వారా డీలర్ల వద్ద ఉన్న యూరియా స్టాక్‌ను చెక్ చేసుకోవచ్చు. బుకింగ్ చేసుకున్న తర్వాత వచ్చే ఐడీ, రసీదు చూపించి ఎరువులు తీసుకోవచ్చు. ఎరువుల నిల్వలు ఇతర సందేహాల కోసం రైతులు తమ మండల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులను, గ్రామ వ్యవసాయ సహాయకులనూ సంప్రదించవచ్చు.

**నేటి నుంచే యాప్ ద్వారా ఎరువుల బుకింగ్**

రైతులు తమకు కావాల్సిన ఎరువులను జాతీయ ఎరువుల విక్రయ ఫ్రేంవర్క్ యాప్ ద్వారా ఈ రోజు నుంచి బుక్ చేసుకోవచ్చని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండల వ్యవసాయ అధికారి పడాల గాంధీ రైతులకు సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సాయంత్రం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. రైతులు తమకు ఉన్న పంట విస్తీర్ణం బట్టి వివిధ రకాల ఎరువులను వివిధ ఎరువుల దుకాణాల్లో అందుబాటులో ఉన్న ఎరువులను బట్టి దుకాణాన్ని ఎంపిక చేసుకుని బుక్ చేసుకోవచ్చని వివరించారు. ఎరువులను బుక్ చేసిన తరువాత వచ్చిన క్యూ ఆర్ కోడ్ లేదా టోకెన్ నంబర్, ఆధార్ లింక్ అయిన మొబైల్ తో మరుసటి రెండు రోజుల్లోనూ ఎరువులను బుక్ చేసిన దుకాణాలకు వెళ్లి వివరాలు సరిపోలిన అనంతరం నగదు చెల్లించి బుక్ చేసిన ఎరువులు పొందవచ్చని తెలిపారు. కౌలు రైతులు కూడా భూమి యజమాని ధృవీకరణ అనంతరం ఎరువులను తమ పేరుతో బుక్ చేసుకోవచ్చని వివరించారు. తాము చేసిన బుకింగ్ ను రద్దు చేసుకునే అవకాశం కూడా ఉన్నదని, రెండు రోజుల్లో ఎరువులను తీసుకోని యెడల ఆటోమేటిక్ గా బుకింగ్ రద్దు అవుతుందని, నాలుగో రోజు మరలా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. రైతులు ఈ విధానంలో తమ సందేహాలకు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. మొబైల్ ఫోన్ యాప్ లో ఎరువులను ఎలా కొనుగోలు చేయాలో చరవాణీలో రైతులకు చూపించి శంఖవరం మండల వ్యవసాయ అధికారి పడాల గాంధీ వివరించారు.

# పిల్లి కూతలు మాని బహిరంగ చర్చకురా..

**వైసీపీ ఇన్ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ వ్యాఖ్యలపై టీడీపీ నాయకుల సవాల్**



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలన పైనా మంత్రి వాసంశెట్టి సుభాష్ పైనా చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్న రామచంద్రపురం నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ పిల్లి కూతలు ఆపి బహిరంగ చర్చకు రావాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి వనుం వీరబ్రహ్మం పేర్కొన్నారు. కాజులూరు మండలం గొల్లపాలెంలో శుక్రవారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ద్రాక్షారామ మార్కెటింగ్ డైరెక్టర్ ఖండవల్లి శ్రీనివాస్, రామచంద్రపురం టీడీపీ బీసీ సెల్ నాయకుడు వల్లు అర్జునరావు, తణుకువాడ సొసైటీ అధ్యక్షుడు పితాని సతీష్ తదితరులు మాట్లాడుతూ వైసీపీ ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. పక్క రాష్ట్రంలో నివాసముంటూ నెలకో రెండు నెలలకో ఒకసారి వచ్చి ప్రెస్ మీట్లు పెట్టే సూర్యప్రకాష్ కి నిరంతరం ప్రజా సేవలో ఉండే మంత్రి సుభాష్ ని విమర్శించే అర్హత లేదని ఆరోపించారు. గతంలో రామచంద్రపురం వైసీపీ అభ్యర్థిగా నాన్ లోకల్ వ్యక్తయిన చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పోటీ చేయించిన పిల్లి సూర్యప్రకాష్ కి ఇప్పుడు మంత్రి సుభాష్‌ని నాన్ లోకల్ అనే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. గతంలో రామచంద్రపురం నుండి వెళ్లి మండపేటలో తన తండ్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ తో పోటీ చేయించిన సూర్యప్రకాష్ లోకల్, నాన్ లోకల్ అంశంపై మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందని ఏద్దేవా చేశారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆయన తండ్రి వాసంశెట్టి సత్యంలు నిత్యం నిరుపేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతూ లక్షలాది రూపాయలు సొంత నిధులు నిరుపేదల కోసం ఖర్చు చేస్తుంటే వైసీపీ ఇంచార్జ్ సూర్యప్రకాష్ మాత్రం ప్రజా సమస్యల్ని గాలికొదిలి సంపాదన పేరుతో తన సొంత ప్రయోజనాలకే పరిమితమౌతున్నారని మండిపడ్డారు. మంత్రి సుభాష్, ఆయన తండ్రి సత్యంలపై అసత్య ఆరోపణలు చేసిన పిల్లి సూర్య ప్రకాష్ దమ్ముంటే ఆ ఆరోపణల్ని రుజువు చేయాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధికంటే రెట్టించిన అభివృద్ధి ఈ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం చేసి చూపించిందని స్పష్టం చేశారు. బూటకపు మాటలతో ప్రజలతో చీకొట్టించుకుని 11 స్థానాలకే పరిమితమైనా వైసీపీ నాయకులు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు పోతురాజు భీమరావు, సెలపాక మాజీ సర్పంచ్ పోతుల గనిరాజు, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు పేపకాయల బాబ్జి, మండల టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బొక్కా రాజు, మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గుబ్బల నాగేంద్రకుమార్, క్లస్టర్ ఇంచార్జ్ పలివెల రాజు, సొసైటీ చైర్మన్ అంగర కృష్ణ, బీజేపీ నాయకులు పోతుల వీరబాబు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు సోమాలమ్మ, ఆర్యవటం టీడీపీ నాయకులు చందాల వీరబాబు, యరకం నాగేశ్వరావు పాల్గొన్నారు

## మంత్రి సుభాష్‌పై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**రామచంద్రపురం కూటమి నేతలు**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరియు వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ వ్యవస్థాపకులు వాసంశెట్టి సత్యంపై వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్‌రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను కూటమి పార్టీల నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్థానిక కూటమి నేతలు మాట్లాడుతూ, రాజకీయ ప్రయోజనాల కోసం స్థాయిని మరచి వ్యక్తిగత విమర్శలకు దిగడం పిల్లి సూర్యప్రకాశ్‌రావుకు తగదని హితవు పలికారు. మంత్రి సుభాష్ కుటుంబంపై చేసిన ఆరోపణలకు తగిన ఆధారాలు ఉంటే బయటపెట్టాలని వారు సవాల్ విసిరారు. నిరుద్యోగుల వద్ద డబ్బులు వసూలు చేసి కేసులు ఎదుర్కొంటున్న చరిత్ర కలిగిన వారు నిత్యం ప్రజా సేవలో తరించే మంత్రి కుటుంబం గురించి మాట్లాడటం విడ్డూరమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను, మంత్రి సుభాష్ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు విషప్రచారం చేస్తున్నారని నేతలు ఆరోపించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీ గురించి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత పిల్లి సూర్యప్రకాశ్‌రావుపై ఉందని వారు గుర్తు చేశారు. ముఖ్యంగా సంక్రాంతి సంబరాల వంటి సేవా కార్యక్రమాలను సైతం రాజకీయ కోణంలో విమర్శించడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. డీఎస్సీ నియామకాల్లో పారదర్శకతను పాటిస్తున్న ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేసి యువతను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని హెచ్చరించారు. గత రెండేళ్లలో రామచంద్రపురం నియోజకవర్గంలో సుమారు రూ.250 కోట్లతో చేపట్టిన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులను స్వయంగా వచ్చి చూడాలని కావాలంటే అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ప్రజల తీర్పును గౌరవించి, నిర్మాణాత్మక రాజకీయాలు చేయడం నేర్చుకోవాలని లేనిపక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కూటమి నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కూటమికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రామచంద్రపురంలో 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు'**

## నిరసన ర్యాలీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో నిర్వహించిన నిరసన కార్యక్రమం ఘనవిజయంగా ముగిసింది. లారీ యూనియన్ కార్యాలయం నుండి రాజగోపాల్ సెంటర్ వరకు నిర్వహించిన ఈ భారీ ర్యాలీలో పార్టీ శ్రేణులు, యువత, మహిళలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్య ప్రకాష్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి పిల్లి సుభాష్ చంద్రబోస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తీవ్రస్థాయిలో విమర్శించారు. రామచంద్రపురం నుండి ఎలక్ట్రికల్ డివిజన్ కార్యాలయం తరలిపోతున్నా స్థానిక మంత్రి దీనిపై స్పందించకపోవడంపై నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికీ, ప్రత్యేకించి పార్టీ శ్రేణులకు మరియు ప్రజలకు పిల్లి సూర్య ప్రకాష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపు**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ పేర్కొన్నారు. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం ప్రజ్ఞా ఫంక్షన్ హాల్లో తిమ్మాపురం జనసేన గౌరవ అధ్యక్షులు మాదారపు తాతాజీ ఆధ్వర్యంలో నియోజవర్గ స్థాయి బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నానాజీ రావడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉన్నటువంటి ఒటర్లను పరిశీలన మరియు ఒటర్లను తమ పార్టీకి అనుకూలంగా చేసిన అభివృద్ధిని తెలియజేస్తూ ప్రతి ఇంటింటికి వెళ్లాలని సూచించారు. గత 2002లో ఈ సర్వే జరిగిందని మరల 24 సంవత్సరాల తర్వాత జరిగే సర్వేలో జరిగే సర్వేలో ఓటర్లను గుర్తించి పూర్తిస్థాయిలో జాబితాను తయారు చేయవలసి ఉందని తెలిపారు. బూత్ లెవెల్ ఏజెంట్లు కీలకంగా ఒటర్ జాబితాలో వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. వారు సక్రమంగా ఉంటేనే నాయకులు పదవులను అనుభవించడానికి దోహద పడుతుందని తెలిపారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు పరిచయ బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లదే అని అన్నారు.ప్రతి గ్రామంలోనూ చేసిన అభివృద్ధిని ఫ్లెక్సీలుగా రూపొందించి పెట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనంతలక్ష్మి, యువ నాయకుడు పంతం సందీ, బూత్ లెవెల్ ఏజెంట్లు, జనసేన నాయకులు జన సైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయితీ కార్యదర్శి చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వేళంగి గ్రామంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ మరియు రస్నా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. యూత్ ఆహ్వానం మేరకు గ్రామపంచాయతీ అధికారి పి.ఉమామహేశ్వరి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈమెతో గ్రామ సచివాలయం సెక్రటరీ ప్రియంక హాజరయ్యారు.వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వలన డిహైడ్రేషన్ వడగల్పుల నుండి రక్షణ కొరకు చల్లటి మజ్జిగను, రస్నా ను ఉపాధి హామీ కూలీలకు మరియు ప్రయాణికులకు, వృద్ధులకు,అక్కడ ఉన్న కొంతమంది గ్రామస్తులకు ఈ అధికారుల చేతులు మీదుగా మజ్జిగను రస్నాను పంపిణీ చేశారు. పంచాయతీ అధికారి ఉమామహేశ్వరి మాట్లాడుతూ గ్రామంలో గ్రాడ్యుయేట్ యూత్ సేవలు అభినందనీయమని, ఈ వేసవికాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం మరియు అనేకమందికి దాహార్తిని తీర్చునందుకు యూత్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి నేను కూడా హాజరైనందుకు చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మేడిశెట్టి పట్టాభి, గ్రాడ్యుయేట్ యూత్ సభ్యులు, యువత పాల్గొన్నారు.

## డాక్టర్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ భానుగుడి జంక్షన్ లో గల సన్ రైస్ హాస్పటల్లో డాక్టర్ బొండ సూర్యారావు, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలోప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. జనసేన నాయకులు డాక్టర్ బోండా సూర్యారావు మాట్లాడుతూ "ప్రతి సంవత్సరం జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం"గా జరుపుకుంటారని, బాలల హక్కులను రక్షించడం, వారి విద్యావకాశాలను మెరుగుపరచడం మరియు సమాజం నుండి బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడమే ఈ రోజు యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. బాలకార్మిక వ్యవస్థను అరికట్టడానికి, ఈ సమస్యపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించడానికి 2002వ సంవత్సరంలో జూన్ 12ను "అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం"గా ప్రకటించారని, ఆటపాటలతో, చదువుతో సాగాల్సిన బాల్యాన్ని పనుల పేరుతో దూరం చేయకుండా కాపాడటం, ప్రతి బిడ్డకూ ప్రాథమిక విద్య అందేలా చూడటం, అందరికీ చదువే, బాలకార్మిక వ్యవస్థకు శాశ్వత విరుగుడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

**కాకినాడ రూరల్‌లో**

## వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం విజయవంతం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయినందున రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు వైఎస్ఆర్ పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని కాకినాడ రూరల్‌లో బైక్ ర్యాలీలతో నిర్వహించారు. ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదంటూ చేసిన ప్రతి హామీ మోసం అంటూ, యువతను మోసం చేసిందంటూ, ఈ దగా ప్రభుత్వం మనకు అక్కర్లేదని కాకినాడ రూరల్ మాజీ మంత్రివర్యులు కురసాల కన్నబాబు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



## కేంద్రం కీలక నిర్ణయం

**125 రోజులకు పని దినాల పెంపు**

గ్రామీణ ప్రజల ఆర్థిక భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కింద గతంలో ఉన్న 100 రోజుల పని దినాలను 125 రోజులకు పెంచుతూ 'వీబీజీ రామ్' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ కొత్త పథకం 2026, జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వస్తుందని, ఇది గ్రామీణ ఉపాధి కల్పనలో కీలక మలుపు అని ఆయన పేర్కొన్నారు.



# కార్యకర్తల కష్టం.. ప్రజల ఆశీర్వాదమే మా బలం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగర ప్రజలకు నేరుగా అందుబాటులో ఉండటమే తమ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 1వ, 2వ డివిజన్లలో "మన వార్డులో - మన ఆదిరెడ్డి" కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు.

**రూ. 8 కోట్లకు పైగా అభివృద్ధి పనులు**

గత రెండేళ్లలో 1, 2వ డివిజన్లలో రూ. 3.83 కోట్ల విలువైన రోడ్లు, డ్రైన్లు తదితర పనులు పూర్తిచేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం రూ. 4.12 కోట్ల పనులు కొనసాగుతున్నాయని, మొత్తం రూ. 8 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని వెల్లడించారు. తారకరామనగర్‌లో రూ. 3 కోట్ల వ్యయంతో డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధి చేపట్టినట్లు చెప్పారు.

**కార్యకర్తలే విజయానికి కారణం**

2024 ఎన్నికల్లో కూటమికి భారీ మెజారిటీ రావడానికి తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తల కృషే కారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తన గెలుపునకు సహకరించిన ప్రతి కార్యకర్త ఎమ్మెల్యేతో సమానమని, అధికారులు వారిని గౌరవించాలని సూచించారు.

**పారిశుద్ధ్యం, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి**

నగరంలో ఖాళీగా ఉన్న శానిటేషన్ పోస్టుల భర్తీ చేపడుతున్నామని, ఇప్పటికే 30 మందికి ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, రౌడీ మూకలపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

**భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలు**

బత్తినగర్ పార్కు అభివృద్ధితో పాటు దేవాలయాలు, మసీదుల అభివృద్ధి పనులను భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేపడుతున్నామని తెలిపారు. మతాలకు అతీతంగా సేవ చేయడమే తమ కుటుంబ ధ్యేయమని పేర్కొన్నారు.

**మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి రూ. 1.50 లక్షల సాయం**

ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్త పుల్లూరి శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే, భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ. 1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

**కార్యకర్త ఇంటిలోనే రాత్రి బస**

కార్యక్రమం అనంతరం కార్యకర్తలతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే, అనంతరం టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మామిడి శ్రీను నివాసంలో రాత్రి బస చేశారు. ఉదయం నుంచి వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ప్రజా సమస్యలను స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. "కార్యకర్తల కష్టం, ప్రజల ఆశీర్వాదమే తమ బలం" అని పేర్కొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, అభివృద్ధి, సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణలో కూటమి ప్రభుత్వం విశేష ఫలితాలు సాధించిందని అన్నారు.

### పతాంజలి ఆధ్వర్యంలో రైతులకు

# ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన

### డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రకాష్




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతులు వరిపంట నుండి ఆయిల్ ఫామ్‌పై దృష్టి సారిస్తే తక్కువ పెట్టుబడి దీర్ఘకాలం అధిక లాభాలు పొందవచ్చునని తద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఏఎస్ ప్రకాష్ అన్నారు. శుక్రవారం మధురపూడిలో హార్టికల్చర్, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు ఫామ్ ఆయిల్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ ప్రకాష్ మాట్లాడుతూ వరిసాగు వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులకు వరిసాగు కంటే పామ్ ఆయిల్ వల్ల కలిగే లాభాలను తెలిపారు. పామాయిల్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, డ్రిప్ ఇరిగేషన్ పై రాయితీలు వంటి అంశాలను తెలియ జేశారు. హార్టికల్చర్ అధికారి సాయి కుమార్ మాట్లాడుతూ గ్రామంలో వరిసాగు ఎక్కువగా ఉందని, బోర్ల క్రింది వరి పండించే పొలాలను పంట మార్పిడి చేసి, రైతులు పామ్ ఆయిల్ సాగు పై దృష్టి సారిస్తే ప్రభుత్వ ప్రోత్సాహంతో తక్కువ పెట్టుబడి, ఎక్కువ కాలం అధిక దిగుబడి తద్వారా అధిక లాభాలు వస్తాయన్నారు. పామ్ ఆయిల్ సాగు పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలు అందచేస్తున్న ప్రోత్సాహకాలు, సూక్ష్మ సేద్యంలో రాయితీలు రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా డ్రిప్ ద్వారా తోటకు ఎరువులు అందించడం వలన ఉపయోగాలు, అంతర్ పంటల సాగు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ దీ తరుణ్ సత్య సాయి, పామ్ ఆయిల్ కంపెనీ సిబ్బంది దుర్గాప్రసాద్, రాజేష్, నవీన్, నవ్య, గ్రామస్తులు తదితరులు పాల్గున్నారు.

# రామకృష్ణ నేచురల్ ఫామ్‌లో మొక్కలు నాటిన ఆర్డీవో శివ రాముడు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** వీరలంకపల్లి రామ కృష్ణ నేచురల్ ఫామ్‌లో రాజమహేంద్రవరం ఆర్డీవో శివరాముడి మొక్కలు నాటారు. శుక్రవారం రామకృష్ణ నేచురల్ ఫామ్ ను తిలకించి, సేంద్రీయ విధానంలో సాగు, సేంద్రియ ఎరువులు తయారీ వంటి అంశాలపై ఆదర్శ రైతు కోరిపల్లి అప్పలస్వామితో కొద్దిసేపు ముచ్చటించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యరీత్య రైతులు సేంద్రీయ సాగుపై దృష్టి సారించాలని, తద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ రాయితీలు, భవిష్యత్తులో వ్యవసాయ పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టవలసిన చర్యలు వంటి అంశాలపై ముచ్చటించినట్లు తెలియ వచ్చింది. అనంతరం ఆర్డీవో శివ రాముడు కొబ్బరి మొక్కలు నాటి, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్రీనరీలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పి రామకృష్ణ, డిప్యూటీ తాసిల్దార్ వి రత్నసాగర్, గళ్ళ రాము, ఆదర్శరైతు కోరుపల్లి అప్పలస్వామి, నాగు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియలో ఎస్ఐఆర్ కీలకం

### తహశీల్దార్ పి. తేజేశ్వరరావు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఓటరు జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ కార్యక్రమం అమలుపై బూత్ లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లకు శుక్రవారం మండపేట ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని సహాయ ఓటరు నమోదు అధికారి, తాహశీల్దార్ పి. తేజేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా తాహశీల్దార్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో కీలకమని తెలిపారు. బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు పూర్తి నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చడం, అనర్హులను తొలగించడం, వివరాల్లో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిశీలించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే ద్వారా ఖచ్చితమైన సమాచారం సేకరించి నిర్ణీత గడువులో కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ పిఎ మెహర్ బాబా, సీనియర్ అసిస్టెంట్ ఎం పద్మనాభం, డిప్యూటీ ఎంపీడిఓ అనిల్ కుమార్‌తో పాటు మండలంలోని బిఎల్ఎలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


# సీతానగరం నూతన ఎస్సైగా ఎల్. శ్రీనివాస్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం నూతన ఎస్సైగా ఎల్ శ్రీనివాస్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. అనపర్తి పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించి సాధారణ బదిలీపై సీతానగరం పోలీస్ స్టేషన్ కు వచ్చారు. శుక్రవారం నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం మరియు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి ఏవైనా సమస్యలు ఉంటే నిర్భయంగా పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని ఆయన కోరారు.

# రాజీవ్ గృహాకల్ప పట్టాల పంపిణీ

### 44 మంది లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే వేగుళ్ల



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పురపాలక సంఘం 30వ వార్డులోని రాజీవ్ గృహాకల్ప సముదాయానికి చెందిన 44 మంది అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం పట్టాలు పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలోని ఎమ్మెల్యే ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పట్టాలు అందజేశారు. ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ డిసెంబర్ 2025లో మొదటి విడతగా 173 మందికి పట్టాలు ఇచ్చామన్నారు. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన 44 మందిని గుర్తించి రెండో విడతలో పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. మిగిలిన గృహాలకు కూడా విడతల వారీగా అర్హులకు పట్టాలు ఇస్తామన్నారు. పట్టాలు పొందినవారు తప్పనిసరిగా కేటాయించిన ఇళ్లలోనే నివాసం ఉండాలనీ పేర్కొన్నారు. ఖాళీగా ఉంచితే మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుని పట్టా రద్దు చేసి అర్హులైన వేరే వారికి కేటాయిస్తామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ టి.వి. రంగారావు, గృహ నిర్మాణ శాఖ ఎఇ ఎ కె ఎస్ తేజ, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, టిడిపి నాయకులు ఉంగరాల రాంబాబు, టిడిపి టౌన్ అధ్యక్షులు మచ్చా నాగు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# రామచంద్రుడు కాల్వ పుంత రహదారి బైపాస్ రోడ్ వరకు నిర్మించాలి

### ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే వేగుళ్ళకు అర్జీ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట రామచంద్రుడు కాల్వ గట్టు 27 వ వార్డు పరిధిలో ఉన్న పుంత రహదారిను సీసీ రోడ్‌గా నిర్మించి ఈ ప్రాంత ప్రజలు రాకపోకలు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, మాజీ కౌన్సిలర్ లంకలపల్లి రాంబాబు, ఇనపకోళ్ళ రామకృష్ణ(ఐఆర్కె), జనసేన నాయకులు పాలమూరి విజయ్‌లు పేర్కొన్నారు. మండపేట టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఈ రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా పలు సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల మనస్సును ఎమ్మెల్యే వేగుళ్ళ గెలుస్తున్నారన్నారు. ఈ క్రమంలో దీర్ఘ కాలంగా రోడ్డు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న తమ వార్డు ప్రజలకు రోడ్డు సౌకర్యాలు కల్పించాలని కోరారు. 25,26,27,28 వార్డుల ప్రజల సమస్యను పరిష్కరించినట్లు అవుతుందన్నారు. మండపేట రామచంద్రుడు కాలువ గట్టు బిక్కిన అమ్మన్న నగర్ సెల్ టవర్ల రోడ్డు నుండి పుంత రోడ్డు ఉందన్నారు. ఇది బైపాస్ రోడ్డులోని భారత్ పెట్రోలియం బంక్ సమీపం లో గల కల్వర్టు వద్ద అనుసంధానం అవుతుందనీ వివరించారు. బండి బాటగా రైతులు ఈ పుంతను గత శతాబ్ద కాలం నుండి ఉపయోగిస్తున్నారనీ తెలిపారు. ఈ రోడ్డు వెంబడి రామచంద్రుడు పంటకాలువ విస్తరించి ఉన్నదన్నారు. కాగా నాలుగు వార్డుల ప్రజలు బైపాస్ రోడ్డుకు వెళ్ళాలి అంటే అటు ఏడిదరోడ్డు, ఇటు సత్యశ్రీ రోడ్డు ల మీదుగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పుడు ప్రతిపాదిత రామచంద్రుడు కాలువ గట్టు నుండి పుంతరోడ్డును విస్తరించి సి.సి. రోడ్డు నిర్మిస్తే సైధిల్లీపేట, గాంధీనగర్, పార్ధసారధి నగర్, బిక్కిన అమ్మన్న నగర్ , వాటర్ వర్క్సు ఏరియా లో నివశిస్తున్న ప్రజలకు రాకపోకలు చేసేందుకు సులువైన మార్గం దగ్గర దారి ఏర్పడుతుందన్నారు. బి సి మైనార్టీ వర్గాలు ఎక్కువగా నివసించే ఈ వార్డు ప్రజల చిరకాల కోరికను పరిష్కరించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా విజ్ఞప్తి చేశారు . ఇందుకు సంబంధించి రామచంద్రుడు కాలువ గట్టు వెంబడి ఉన్న రైతులు సంబంధిత స్థలాల యజమానులు రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని మండపేట పురపాలక సంఘంకు రిజిష్టర్ చేసి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రైతులు, గాంధీనగర్, పార్ధసారధి నగర్, బిక్కిన అమ్మన్న నగర్, వాటర్ వర్క్సు ఏరియా ప్రజలు, వల్లూరి సుబ్బారావు, మురళి, ఎస్. కుమారి, ఐజెయు మాజీ సభ్యులు సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# వినికిడి యంత్రం బహుకరణ

### వృద్ధుడికి అండగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో శుక్రవారం ఓ వృద్ధుడికి వినికిడి యంత్రాన్ని అందజేసి స్వర్ణాంధ్ర సేవా సంస్థ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకుంది. ఎవరు సాయం కోరినా వారికి అవసరమైన ఉపకరణాలు, సహాయాన్ని అందించడమే సంస్థ లక్ష్యమని స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. భరణికాని సన్యాసిరావు అనే ఒంటరి వృద్ధుడికి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వినికిడి యంత్రం అవసరమని సూచించారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా దానిని కొనుగోలు చేయలేకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది స్వర్ణాంధ్ర సేవా సంస్థను సంప్రదించాలని సూచించారు. దీంతో సంస్థను ఆశ్రయించిన సన్యాసిరావుకు డాక్టర్ గుబ్బల రాంబాబు వినికిడి యంత్రాన్ని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, వినికిడి యంత్రాలు, ఊతకర్రలు, వీల్‌చైర్లు, మూడు చక్రాల సైకిళ్లు, వాకర్లు వంటి ఉపకరణాలను అవసరమైన వారికి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. అందుబాటులో లేని ఉపకరణాలను కొనుగోలు చేసి పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వైద్యుల సిఫార్సు లేఖతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పిస్తే అవసరమైన వారికి అన్ని సేవలు ఉచితంగా అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ సిబ్బంది పూర్ణ, దివ్య, సత్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు పంపిణీ

### ప్రధానోపాధ్యాయురాలు గంగాభవాని



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని గుమ్ములూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లును అందచేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు గంగభవాని తెలిపారు. శుక్రవారం గుమ్ములూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల చైర్మన్ గొల్లపల్లి అప్పారావు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాకిట్లు అందజేశారు. ఈ సందర్భంగా గంగాభవాని మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యపడుతుందని, ప్రతి విద్యార్థిని విద్యార్థి తప్పనిసరిగా అభ్యసించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గార్డులకు ఉచిత పుస్తకాలు, బ్యాగులు, ఎకరూప దుస్తులు, షూస్ ఉచితంగా అందించడం తో పాటు పోషకలతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందిస్తుంద న్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి నైపుణ్యం గల ఉపాధ్యాయులతో విద్యా బోధన జరుగుతుందన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని, చదువులతో పాటు ఆటపాటలలో చక్కగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిటికెన భాస్కరరావు, కొవ్వాడ రాజేంద్రప్రసాద్, కంచుమర్తి దుర్గాప్రసాద్, బాలిన వెంకటేశ్వరరావు, చిటికెన శ్రీనివాస్, చిటికెన గోపాలకృష్ణ, మట్టా రామచంద్ర రావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వీరాంజనేయులను పరామర్శించిన పురందేశ్వరి, సోము వీర్రాజు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీజేపీ తూర్పుగోదావరి జిల్లా మీడియా ఇన్‌చార్జ్ వీరాంజనేయులను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు గురువారం ఉదయం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న పురందేశ్వరి, ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుంటూ, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వీరాంజనేయులు త్వరగా కోలుకుని తిరిగి ప్రజా, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించిన పురందేశ్వరి, ఈ క్లిష్ట సమయంలో తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ పరామర్శలో బీజేపీ నాయకురాలు నర్సిపల్లి హారిక, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎంపీ రాకతో వీరాంజనేయులు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# బ్యాంకాక్ టు ముంబై.. బ్యాగ్‌తో టిప్ టాప్‌గా ఫ్లైట్ దిగింది..

## కట్ చేస్తే, అడ్డంగా బుక్కైంది..



బ్యాంకాక్ నుంచి ముంబైకి చేరుకున్న మిసెస్ కేరళ హర్ష సన్నీని కస్టమ్స్ అధికారులు అరెస్ట్ చేశారు. ఆమె లగేజీలో సుమారు రూ.12 కోట్ల విలువైన గంజాయి లభించినట్లు అధికారులు వెల్లడించారు. ట్రాలీ బ్యాగ్‌లో దాచిన 12 వాక్యూమ్ సీల్డ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని చీఌూా చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే బ్యాగ్‌లో మాదకద్రవ్యాలు ఉన్న విషయం తనకు తెలియదని హర్ష సన్నీ చెబుతున్నారు. మిసెస్ కేరళం అరెస్ట్ అయ్యారు. బ్యాంకాక్ నుంచి ముంబై వచ్చిన ఆమెను పకడ్బందీగా పట్టుకున్నారు. అక్రమ గంజాయి రవాణా కేసులో మోడల్, మిసెస్ కేరళం హర్ష సన్నీని అధికారులు ముంబై ఎయిర్ పోర్టులో అరెస్ట్ చేశారు. ఆమె లగేజీ నుంచి దాదాపు 12 కోట్ల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి ముంబై వచ్చిన హర్ష సన్నీ లగేజీ తనిఖీ చేసిన ఎయిర్ పోర్టు అధికారులు గంజాయితో పట్టుబడినట్లు వెల్లడించారు. 28 ఏళ్ల హర్ష సన్నీని అదుపులోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈమె వెనుక ఇంకెవరున్నారు...? అన్న కోణంలో విచారణ షురూ చేశారు. జూన్ 10 అర్ధరాత్రి బ్యాంకాక్ నుంచి ముంబై ఎయిర్ పోర్టుకు హర్ష సన్నీ చేరుకున్నారు. అనుమానం వచ్చిన అధికారులు లగేజ్ చెక్ చేయగా... ట్రాలీ బ్యాగ్‌లో దాచిన 12 వాక్యూమ్ సీల్డ్ ప్యాకెట్లు లభించాయి. చీఌూా ఫీల్డ్ టెస్టింగ్ కిట్‌ను ఉపయోగించి పరీక్షించగా అది గంజాయి అని తేలింది. దీంతో నిషేధిత డ్రగ్స్ స్మగ్లింగ్ చేసినందుకుగానూ హర్ష సన్నీని చీఌూా చట్టం కింద కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారు. అనంతరం హర్ష సన్నీని ఫోర్ట్ కోర్టులో హాజరుపరచగా ఆమెకు జ్యుడిషియల్ కస్టడీ విధించింది న్యాయస్థానం. అయితే, హర్ష సన్నీ వాదన మాత్రం మరోలా ఉంది. ఈవెంట్ పేరిట తనను బ్యాంకాక్ తీసుకెళ్లారని... అక్కడ ఓ వ్యక్తి కలిసి ఒక బ్యాగ్ ఇచ్చి ఇండియాకు తీసుకెళ్లారని కోరినట్టు చెబుతున్నారు. అయితే ఆ బ్యాగ్‌లో చట్టవిరుద్ధమైన వస్తువులు, మాదకద్రవ్యాలు ఉన్నాయన్న విషయం తనకు తెలియదంటున్నారు హర్ష సన్నీ. మరి అధికారులు ఏం తేలుస్తారనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

# 'రావు బహదూర్'తో సిద్ధమైన సత్యదేవ్..!





టాలెంటెడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో, వైవిధ్యభరితమైన చిత్రాల దర్శకుడు వెంకటేష్ మహా కాంబినేషన్‌లో వస్తున్న సైకలాజికల్ డార్క్ కామెడీ డ్రామా 'రావు బహదూర్'. తాజాగా ఈ చిత్రం నుండి విడుదలైన 'జస్ట్ ఏ టీజర్' ప్రేక్షకుల ముందుకు వచ్చి సోషల్ మీడియాలో భారీ క్యూరియాసిటీని పెంచుతోంది. అంతరించిపోతున్న ఒక రాచరిక వ్యవస్థ నేపథ్యంలో, గతాన్ని వదిలిపెట్టలేని ఒక వ్యక్తి కథగా ఈ సినిమాను దర్శకుడు అద్భుతంగా ప్లాన్ చేసినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఈ సరికొత్త టీజర్ ఇంట్రెస్టింగ్ పాయింట్‌తో ఓపెన్ అవుతుంది. ఇందులో సత్యదేవ్ పోషించిన రామప్ప అనే పాత్రకు లివర్ క్యాన్సర్ అని, ఆయనకు చాలా తక్కువ సమయం మాత్రమే ఉందని వైద్యులు చెబుతారు. అయితే, నెలలు గడుస్తున్నా సత్యదేవ్ పాత్ర ఏమాత్రం కుంగిపోకుండా బతికే ఉండటం, అది చూసి చుట్టుపక్కల వారు ఆశ్చర్యపోవడం కథపై ఆసక్తిని కలిగిస్తుంది. కేవలం ఇదొక మిరాకిల్ మాత్రమే కాదు, రామప్ప అంతరంగంలో జరుగుతున్న మానసిక మార్పులను, ఒక విలక్షణమైన సైకలాజికల్ టెన్షన్‌ను టీజర్‌లో చూపించారు. 'డౌట్ ఈజ్ ఏ డెడ్లీ డెమన్' అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ టీజర్‌లో సత్యదేవ్ నటన, ఆయన చూపించిన వేరియేషన్స్ మైండ్ బ్లోయింగ్ అని చెప్పవచ్చు. స్మరణ్ సాయి అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, కార్తీక్ పర్మార్ విజువల్స్ టీజర్‌కు మరింత డార్క్ మూడ్‌ను సెట్ చేశాయి. జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు.

# మా ఇంటి బంగారం సమంతను లేడీ 'భాషా'తో పోల్చిన నందిని రెడ్డి..!




టాలీవుడ్ స్టార్ బ్యూటీ సమంత లీడ్ రోల్‌లో నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'మా ఇంటి బంగారం' జూన్ 19న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయింది. ఈ సినిమాను లేడీ డైరెక్టర్ నందిని రెడ్డి డైరెక్ట్ చేయడంతో ఈ మూవీపై మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఇక ఇప్పటికే ఈ సినిమా టీజర్, ట్రైలర్లు ఈ మూవీపై అంచనాలు పెంచేశాయి. కాగా, ఈ సినిమాలో సమంత చేస్తున్న పాత్రపై డైరెక్టర్ నందిని రెడ్డి కొన్ని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నందిని రెడ్డి ఈ సినిమాలో సమంత పాత్రను సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన ఎవర్‌గ్రీన్ క్లాసిక్ 'భాషా'తో పోల్చారు. ఈ సినిమాలో సమంతను చూస్తే భాషా గుర్తుకు వస్తాడని ఆమె తెలిపింది. అలాంటి షేడ్స్ ఉన్న పాత్రలో సమంత ఇరగదీసిందని.. సామ్ పర్ఫార్మెన్స్ చూసి అభిమానులు థ్రిల్ అవుతారని నందిని రెడ్డి పేర్కొన్నారు. ఇక ఈ సినిమాలో సమంత చేసిన యాక్షన్ ఎపిసోడ్స్ సినిమాకే హైలైట్ అవుతాయని ఆమె తెలిపింది. గుల్షన్ దేవయ్య, దిగంత్ మంచలె, గౌతమి, శ్రీముఖి తదితరులు ఈ సినిమాలో ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు 'కేన్ మామ' వీడ్కోలు



న్యూజిలాండ్ స్టార్ ఆటగాడు కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ జరుగుతుండగానే అతడు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. 35 ఏళ్ల కేన్ కివీస్ తరఫున 110 టెస్టులు, 175 వన్డేలు, 93 టీ20లు ఆడాడు. తన 16 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో 19వేలకుపైగా పరుగులు సాధించాడు. ఇందులో 48 సెంచరీలు, ఆరు డబుల్ సెంచరీలు ఉన్నాయి. దాదాపు ఎనిమిదేళ్లపాటు (2016-24) న్యూజిలాండ్‌కు సారథ్యం వహించాడు. రెండుసార్లు ఐసీసీ వరల్డ్ కప్ ఫైనల్స్‌కు తన జట్టును చేర్చాడు. తొలి ఐసీసీ టెస్టు ఛాంపియన్‌షిప్ విజేతగా కివీస్ నిలవడంలో కేన్ కెప్టెన్సీదే కీలక పాత్ర. 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన కేన్ విలియమన్స్ గతేడాది టీ20లకు వీడ్కోలు పలికాడు. ఇప్పుడు మిగతా రెండు ఫార్మాట్లకూ గుడ్‌బై చెప్పేశాడు. "ఆటకు వీడ్కోలు పలకడంపై గత కొన్ని రోజులుగా ఆలోచిస్తూనే ఉన్నా. ఇప్పుడు ఇదే సరైన సమయంగా భావిస్తున్నా. అంతర్జాతీయ క్రికెట్ పట్ల నాకు ఎప్పుడూ బలమైన తపన, ఆసక్తి ఉండేవి. న్యూజిలాండ్ తరఫున ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ నా సర్వశక్తులూ ఒడ్డా. ఆ భావనే నన్ను గర్వపడేలా చేస్తోంది. ఇలాంటి గొప్ప జట్టుకు నాయకత్వం వహించడమూ ఆనందంగా ఉంది. నా మనసులో ఎప్పుడూ టీమ్‌కు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇన్నేళ్లూ జట్టులో భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నా" అని కేన్ తెలిపాడు.

**సన్‌రైజర్స్‌తో అనుబంధం..**

కేవలం కివీస్ ప్లేయర్‌గానే కాదు.. తెలుగు క్రికెట్ అభిమానులకూ కేన్ విలియమ్సన్ సుపరిచితుడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు గతంలో నాయకత్వం వహించాడు. అతడి సారథ్యంలో ఎస్ఆర్‌హెచ్ ఫైనల్‌కూ దూసుకెళ్లింది. 2016లో ఛాంపియన్‌గా అవతరించిన జట్టులోనూ అతడు సభ్యుడే. తెలుగు రాష్ట్రాల ఫ్యాన్స్‌కు 'కేన్ మామ'గా మారిపోయాడు. ఐపీఎల్‌లో 79 మ్యాచులు ఆడిన కేన్ 2,128 పరుగులు చేశాడు.

**వ్యక్తిత్వంలోనూ..**

న్యూజిలాండ్ ఆటగాళ్లు సౌమ్యంగానే ఉంటారు. ప్రత్యర్థులను గౌరవించడంలో, క్రీడాస్ఫూర్తిలో ముందుంటారు. ఇక కేన్ విలియమ్సన్ కూడా ప్రత్యర్థి ఆటగాళ్లతో గొడవలు పడిన సందర్భాలు దాదాపు లేవనే చెప్పొచ్చు. విరాట్ కోహ్లీ, కేన్ మంచి స్నేహితులు. వీరిద్దరికీ అండర్ - 19 రోజుల నుంచే పరిచయం. ఇప్పటికీ అదే స్నేహంతో ఉండటం విశేషం.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 సెమీస్‌కు పీవీ సింధు



తెలుగు తేజం, స్టార్ షట్లర్ పీవీ సింధు అద్భుత ఫామ్‌లో ఉంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో సెమీస్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్‌లో తైపీకి చెందిన చెన్ సు యుపై 21-6, 21-9 తేడాతో పీవీ సింధు విజయం సాధించింది. ఏకపక్షంగా సాగిన పోరులో కేవలం 27 నిమిషాల్లోనే చెన్‌ను చిత్తు చేయడం గమనార్హం. ఈ తైపీ ప్లేయర్ ఏమాత్రం ప్రతిఘటన ఇవ్వలేకపోయింది. సెమీస్‌లో జపాన్‌కు చెందిన యమగుచితో సింధు తలపడనుంది. వీరిద్దరిలో సింధు 15-13 ఆధిక్యంలో ఉంది.




# ఫిఫా వరల్డ్ కప్‌లో దక్షిణ కొరియా శుభారంభం

**చెకియాపై సూపర్ విక్టరీ**



ఫిఫా ప్రపంచ కప్‌లో ఆసియా జట్టు దక్షిణ కొరియా శుభారంభం చేసింది. చెకియాపై 2-1 తేడాతో విజయం సాధించింది. గ్రూప్-ఎలో తలపడిన ఇరు జట్లూ గెలుపు కోసం చివరివరకూ పోరాడాయి. అయితే, తొలి అర్ధభాగంలో ఏ జట్టు కూడా గోల్ సాధించలేదు. కానీ, రెండో అర్ధ భాగం నుంచి ఆట రసవత్తరంగా మారింది. రెండో సగం మొదలైన కాసేపటికే చెకియా ఆటగాడు లాడిస్లావ్ గోల్ కొట్టి తన జట్టుకు ఆధిక్యం ఇచ్చాడు. మ్యాచ్ 59వ నిమిషంలో తొలి గోల్ నమోదైంది. మరికాసేపటికే సౌత్ కొరియా ప్లేయర్ హవాంగ్ బోయిమ్ 67వ నిమిషంలో గోల్ కొట్టి స్కోరును సమం చేశాడు. ఇక కాసేపు గోల్స్ కోసం ఇరుజట్లూ శ్రమించాయి. 80వ నిమిషంలో దక్షిణ కొరియా ఆటగాడు ఓ హైన్ గ్యు గోల్ కొట్టి 2-1 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఆట అదనపు సమయంలోనూ కొరియా పట్టువిడవకుండా కాపాడుకుంది. చెకియాను గోల్ కొట్టనీయకుండా కట్టడి చేయగలిగింది. ఆటలో ఎక్కువ భాగం బంతిపై నియంత్రణ దక్షిణ కొరియాకే ఉంది. చెకియా 16 పొరపాట్లు చేయగా.. దక్షిణ కొరియా 9 మాత్రమే చేసింది.

# వయసులో వ్యత్యాసం.. 500 మందికి పైగా యువ రెజ్లర్లపై అనర్హత



యువ రెజ్లర్లపై భారత రెజ్లింగ్ సంఘం కఠిన చర్యలు తీసుకుంది. దాదాపు 500 మందికి పైగా యువ రెజ్లర్లను టోర్నీలో పాల్గొనకుండా వేటు వేసింది. వారంతా తప్పుడు వయసు ధ్రువీకరణ పత్రాలు సమర్పించడమే అందుక్కారణం. 'ఆధార్' ఆధారిత వెరిఫికేషన్ వ్యవస్థను రెజ్లింగ్ ఫెడరేషన్ తీసుకొచ్చింది. బర్త్ సర్టిఫికెట్‌కు, ఆధార్‌లోని వయసుకు వ్యత్యాసం ఉందని గుర్తించింది. దీంతో అండర్-17 నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో పాల్గొనకుండా 500 మందికి పైగా రెజ్లర్లను అనర్హులుగా ప్రకటించింది. జూన్ 6 నుంచి 8 వరకూ ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఈ టోర్నీ జరిగింది. పురుషుల, మహిళల విభాగంలో దాదాపు 1200 మంది వరకు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వయసు నిర్ధరణకు బర్త్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్ కార్డులను జత చేయాలని రెజ్లింగ్ సంఘం స్పష్టం చేసింది. ఈ రెండింట్లో వయసు వ్యత్యాసం కనిపించడంతో వారిపై అనర్హత వేటు పడింది. ఇందులో మెన్స్ ఫ్రీస్టైల్ విభాగంలో 300 మంది, గ్రీకో రోమన్ విభాగంలో 125, మహిళల విభాగంలో 100 మందిపైనా సంఘం చర్యలు తీసుకుంది. కొంతమంది పుట్టిన ప్లేస్, తేదీలు, ఆధార్ కార్డులోని వివరాలతో మ్యాచ్ కాలేదు. మరికొందరు తాము పుట్టిన తేదీ కంటే చాలా ఏళ్ల తర్వాత బర్త్ సర్టిఫికెట్లను తీసుకోవడం గమనార్హం. ఒక రెజ్లర్ బర్త్ సర్టిఫికెట్‌లో సంవత్సరం 2007లో దిల్లీలో పుట్టినట్లు ఉంది. ఆధార్ కార్డులో మాత్రం 2004లో హరియాణాలో జన్మించినట్లు ఉండటం విమర్శలకు దారితీసింది. ఈ వ్యవహారంపై డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్‌సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏజ్ గ్రూప్ పోటీల కోసం వెరిఫికేషన్ వ్యవస్థను బలోపేతం చేసినట్లు తెలిపారు. "వయసు విషయంలో మోసాలు జరిగినట్లు మేం గుర్తించాం. వారిపై కఠిన చర్యలు తీసుకున్నాం. అధిక వయసు వారితో పోటీల్లో పాల్గొనడం వల్ల అర్హత కలిగిన అథ్లెట్లు ఇబ్బందిపడే అవకాశం ఉంది. భవిష్యత్తులోనూ అండర్-15, అండర్-17, అండర్-20 టోర్నీల సమయంలో వయసును కచ్చితంగా నిర్ధరిస్తాం. జూన్ 14, 15 తేదీల్లో జరగనున్న అండర్-17 వరల్డ్ ఛాంపియన్‌షిప్ మహిళల ట్రయిల్స్‌లోనూ ఇవే ప్రొటోకాల్స్ పాటిస్తాం" అని సంజయ్ స్పష్టంచేశారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com